
తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-21-జులై-2025 | సంపుటి : 3 | సంచిక : 55 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# వరంగల్‌లో క్రీడా పాఠశాల ఏర్పాటుకు సీఎం రేవంత్ గ్రీన్‌సిగ్నల్

## విధివిధానాల రూపకల్పనకు సీఎం ఆదేశాలు

- ఉమ్మడి వరంగల్ ఎమ్మెల్యేల ప్రతినిధి బృందంతో భేటీ
- ధర్మసాగర్‌లో క్రీడా పాఠశాల కోసం భూమి అందుబాటులో
- విశేషంగా క్రికెట్ స్టేడియం ఏర్పాటు ప్రతిపాదన
- మంత్రి సురేఖ దంపతులతో విభేదాల నేపథ్యంలో భేటీపై రాజకీయ ఉత్కంఠ
- రెండు వర్గాలతో సీఎం రేవంత్ వేర్వేరు భేటీలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

వరంగల్‌లో తెలంగాణ క్రీడా పాఠశాల ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలించి.. అందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు క్రీడాశాఖ కార్యదర్శితో ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల బృందం కడియం శ్రీహరి నేతృత్వంలో ఆదివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసింది.
ఈ బృందంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజులు ఉన్నారు.

మిగతా 2లో

# గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు కోటి రూపాయల నగదు బహుమతి

- పాతబస్తీ నుంచి ఆస్కార్ వరకూ.. రాహుల్ సిప్లిగంజ్ ప్రయాణం
- ఎన్నికల ముందు హామీని నిలబెట్టుకున్న సీఎం రేవంత్
- తెలంగాణ యువతకు ఆదర్శంగా రాహుల్.. సీఎం ప్రశంసలు
- గద్దర్ అవార్డుల సందర్భంలో చేసిన సూచనను అమలు చేసిన ప్రభుత్వం
- సీఎం రేవంత్‌కు రాహుల్ సిప్లిగంజ్ ధన్యవాదాలు





# మహంకాళి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: భట్టి విక్రమార్క

- తెలంగాణలో బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయని భట్టి విక్రమార్క వ్యాఖ్యానం
- లాల్ దర్వాజా మహంకాళి అమ్మవారికి మంత్రుల పట్టువస్త్ర సమర్పణ
- దేవాదాయ శాఖకు రూ.1290 కోట్ల విడుదల.. బోనాలకు ప్రత్యేక నిధులు
- అమ్మవారిని దర్శించుకున్న రాజకీయ ప్రముఖులు, అధికారులు
- మహంకాళి ఆలయ అభివృద్ధి అంశంపై భట్టి విక్రమార్క హామీ
- లాల్ దర్వాజా బోనాల్లో తొలిసారి పాల్గొన్న వాకాటి శ్రీహరి వ్యాఖ్యలు
- ప్రభుత్వ ఏర్పాట్లతో భక్తులు సమాధానంగా .. ఉత్సవాలపై ప్రశంసలు

2లో

# పంచాయతీరాజ్ తాత్కాలిక ఈఎన్‌సీగా ఎన్. అశోక్ నియామకం



- లుక్ ఆఫ్టర్ బాధ్యతలతో అశోక్‌కు పంచాయతీరాజ్ తాత్కాలిక ఈఎన్‌సీ హోదా
- ఈఎన్‌సీ కనకరత్నం అరెస్టుతో ఏర్పడిన ఖాళీకి భర్తీ
- క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న అశోక్‌కు నూతన బాధ్యతలు
- సెప్టెంబరులో రిటైర్మెంట్ కారణంగా ఎఫ్ఏసీ పదం విస్మరణ
- మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలసిన అశోక్

2లో

# మలేరియాపై దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి టీకా 'అడ్‌పాల్సి వ్యాక్స్' విడుదల

- ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో స్వదేశీ పరిజ్ఞానంతో టీకా అభివృద్ధి
- క్లినికల్ ట్రయల్స్‌లో అద్భుత ఫలితాలు.. పూర్తి రక్షణ, మెరుగైన రోగనిరోధకత
- ఉత్పత్తి, విక్రయానికి అర్హత కలిగిన సంస్థలకు లైసెన్సింగ్ ప్రక్రియ ప్రారంభం

2లో



# హైదరాబాద్‌లో ముగిసిన బోనాలు.. నేడు అమ్మవారి ఘటం ఊరేగింపు



- గోల్కొండ బంగారు బోనం నుండి లాల్ దర్వాజా బోనంతో ముగిసిన ఉత్సవాలు
- లక్ష్మి ఏనుగుపై అమ్మవారి ఘటంతో ఊరేగింపు.. డప్పు, పోతరాజుల తాలూకు రంకెలు
- విజయవంతమైన బోనాల ఉత్సవాలపై మంత్రి కొండా సురేఖ సంతృప్తి
- తెలంగాణ ఆధ్యాత్మిక పరంపరకు ప్రతీకగా బోనాలు
- రాష్ట్రవ్యాప్తంగా బోనాల జాతరలతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది
- ఉత్సవాల విజయానికి కృషి చేసిన శాఖల సిబ్బందికి మంత్రి ధన్యవాదాలు
- బోనాలకోసం అధిక నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ మహానగరంలో ఆషాఢ మాస బోనాల వేడుకలు ఈ సంవత్సరం జూన్ 26న గోల్కొండ కోటలోని శ్రీజగదంబిక అమ్మవారి ఆలయంలో బంగారు బోనంతో ప్రారంభం కాగా.. ఆదివారం సింహవాహిని బోన సమర్పణతో ముగిశాయి. నేడు హంపి నుండి తీసుకొచ్చిన లక్ష్మి ఏనుగుపై అమ్మవారి ఘటం ఊరేగింపు డప్పు నృత్యాలు, పోతరాజు ప్రదర్శనలతో వైభవంగా జరగనుంది. ఇందుకోసం రాష్ట్ర దేవదాయశాఖ అధికారులు సకల ఏర్పాటు చేశారు. చారిత్రాత్మక గోల్కొండలో వెలసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాడ మాసం తొలి బోనం సమర్పించడంతో జంటనగరాల్లో

మిగతా 2లో

# సొంత పార్టీ నేతలే వెన్నుపోటు పొడిచారు

## బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు

- 2023 ఎన్నికల్లో వెన్నుపోటుకు గురయ్యానని ఆవేదన వ్యక్తం
- కార్యకర్తలే నా బలం.. వారిని దూరం చేయాలని కుట్రలు జరుగుతున్నాయన్న ఆరోపణ
- పదవుల కోసం పార్టీలు మారలేదని స్పష్టం చేసిన ఈటల
- సోషల్ మీడియాలో దుష్ప్రచారంతో వ్యక్తిగత ముప్పు పెరుగుతోందని ఆరోపణ
- హుజూరాబాద్ అభివృద్ధికి అధికార, ప్రతిపక్షంలోనూ కృషిచేశానన్న ఈటల

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తనను సొంత పార్టీ వాళ్లే వెన్నుపోటు పొడిచారని.. బీజేపీ సీనియర్ నాయకుడు, ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాజాగా ఆయన పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో గత 2023 ఎన్నికల్లో జరిగిన పరిణామాలు సహా.. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను కూడా వివరించారు. ఇటీవల కాలంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కు.. ఆయనకు మధ్య వివాదాలు ముసురుకున్న విషయం తెలిసిందే.

మిగతా 2లో



# సిందూర్‌పై చర్చకు సై..

## నేటి నుంచే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- విపక్షాల డిమాండ్లలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మణిపూర్ అంశాల ప్రాధాన్యం
- అఖిలపక్ష భేటీలో పార్టీలు ఉత్కంఠభరితంగా తమ సమస్యలు ప్రస్తావించిన తీరు
- వర్షా కాల సమావేశాల్లో 8 కొత్త బిల్లులు, పెండింగ్ బిల్లులపై చర్చకు ఏర్పాట్లు
- చిన్న పార్టీలకు సమయం ఇచ్చేందుకు కృషి చేస్తామన్న కిరణ్ రిజిజు
- ప్రధాని మోదీ పార్లమెంట్‌లో పాల్గొననున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటన

5లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు కోటి రూపాయల నగదు బహుమతి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)




ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌కు ఇచ్చిన హామీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా కోటి రూపాయల నగదు పురస్కారాన్ని రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. పాతబస్తీ కుర్రోడిగా మొదలైన రాహుల్ ప్రస్థానం ఆర్.ఆర్.ఆర్ సినిమాలో నాటు నాటు పాట ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అస్కార్ దాకా వెళ్లింది. సొంత కృషితో ఎదిగిన అతడు తెలంగాణ యువతకు మార్గదర్శకుడని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

గత ఎన్నికలకు ముందు జరిగిన ఓ కార్యక్రమంలో కూడా అప్పటి టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోటి రూపాయల నగదు పురస్కారం ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇటీవల గద్దర్ అవార్డుల సందర్భంగా కూడా ప్రత్యేకంగా రాహుల్ సిప్లిగంజ్‌ను ప్రస్తావిస్తూ త్వరలోనే ప్రభుత్వ ప్రకటన ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ మేరకు ఆదివారం పాతబస్తీ బోనాల పండగ సందర్భంగా రాహుల్‌కు భారీ నజరానాను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా రేవంత్ ప్రభుత్వానికి రాహుల్ సిప్లిగంజ్ ధన్యవాదాలు తెలిపారు.

# మహంకాళి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: భట్టి విక్రమార్క



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బోనాలు తెలంగాణ సంస్కృతిలో అనాదిగా కొనసాగుతూ వస్తున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. గోల్కొండలో మొదలైన ఉత్సవాలు, సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల వరకు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఆదివారం లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారిని మల్లు భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. అమ్మవారికి మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మల్లు భట్టి విక్రమార్కని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. బోనాలు ప్రశాంతంగా అత్యంత భక్తి భావంతో కొనసాగుతున్నాయని తెలిపారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి రాష్ట్ర ప్రజలను చల్లగా చూడమని వేడుకున్నానని అన్నారు. దాదాపు రూ.1290 కోట్లతో దేవాదాయ శాఖకు నిధులు విడుదల చేశామని వెల్లడించారు. రూ.20 కోట్ల నిధులు హైదరాబాద్‌లో బోనాల కోసం విడుదల చేశామని ప్రకటించారు. ప్రభుత్వపరంగా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. మహంకాళి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

అమ్మవారి దర్శించుకున్న ప్రముఖులు సింహవాహిని మహంకాళి అమ్మవారి దర్శనం కోసం పలువురు ప్రముఖులు క్యూ కడుతున్నారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ కవిత, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన దర్శించుకున్నారు.

**లాల్ దర్వాజా బోనాల ఉత్సవాల్లో మొదటిసారి పాల్గొన్నా:మంత్రి వాకాటి శ్రీహరి**

లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాల ఉత్సవాల్లో మొదటిసారి పాల్గొన్నానని మంత్రి వాకాటి శ్రీహరి తెలిపారు. అమ్మవారి దయతో అందరూ సుభిక్షంగా ఉండాలని, తెలంగాణ ప్రభుత్వానికి అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని మంత్రి వాకాటి శ్రీహరి కోరుకున్నారు.

# హైదరాబాద్‌లో ముగిసిన బోనాలు.. నేడు అమ్మవారి ఘటం ఊరేగింపు

(మొదటి పేజీ తరువాయి)



మొదలైన బోనాల ఉత్సవాలు దేవాదాయ శాఖ, ఇతర శాఖల కృషి, పర్యవేక్షణతో నెల రోజుల పాటు జరిగిన బోనాల ఉత్సవాలు విజయవంతం కావడం పట్ల రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రజల ఆధ్యాత్మిక సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ అని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రకృతితో మమేకమై జీవించే వ్యవసాయ ఆధారిత సమాజ సాంప్రదాయ సామూహిక తాత్వికత, బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ గడ్డమీద నుంచి ప్రపంచానికి ప్రదర్శితం అవుతుందనీ సురేఖ చెప్పారు. తెలంగాణ సాంప్రదాయానికి అద్దంపట్టే బోనాల జాతరతో రాష్ట్రమంతటా ఆధ్యాత్మకత ఉట్టిపడిందనీ వివరించారు. గోల్కొండలో మొదటి బోనంతో ప్రారంభమైన ఆషాఢ బోనాల జాతర లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారికి బోనం సమర్పించడంతో బోనాల ఘటం ముగుస్తుందనీ గుర్తుచేశారు.


కాగా, బోనాల ఉత్సవాలు విజయంతం కావడానికి కృషి చేసిన దేవాదాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, ఎలక్ట్రిసిటీ సిబ్బంది ఇతర శాఖల అధికారులకు, సిబ్బందికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. అయితే, ఈ సందర్భంగా గత సంవత్సరం కంటే ఈసారి బోనాలకు అధిక నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మంత్రి కొండా సురేఖ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# మలేరియాపై దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి టీకా 'అడ్‌పాల్సి వ్యాక్స్' విడుదల

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)



దోమకాటు ద్వారా సోకే మలేరియా వ్యాధితో దేశ వ్యాప్తంగా ప్రతిఏటా వేలాది మంది మరణిస్తున్నారు. ప్రాణాంతక మలేరియాను అరికట్టడానికి భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) దేశీయ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. భువనేశ్వర్‌లోని రీజినల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్(ఎన్ఐఎంఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ భాగస్వామ్యంతో 'అడ్‌పాల్సి వ్యాక్స్' పేరిట పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ టీకాను అభివృద్ధి చేసింది. మలేరియా వ్యతిరేక పోరాటంలో ఈ టీకా కీలక అస్త్రం అవుతుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది రీకాంబినెంట్ మల్టీ స్టేజ్ వ్యాక్సిన్ అని అంటున్నారు. ఇప్పటి దాకా నిర్వహించిన క్లినికల్ ప్రయోగాల్లో ఆశించిన ఫలితాలు లభించాయి. టీకా తీసుకున్న వారికి మలేరియా నుంచి పూర్తి రక్షణ లభించడంతోపాటు రోగ నిరోధక శక్తి తగ్గే ముప్పును ఇది గణనీయంగా నివారిస్తున్నట్లు తేలింది. మనుషుల్లో ప్లాస్మోడియం ఫాల్సిపరమ్ ఇన్ఫెక్షన్‌ను సమర్థంగా అడ్డుకుంటున్నట్లు వెల్లడయ్యింది. 'అడ్‌పాల్సివ్యాక్స్' తయారీ, విక్రయం కోసం అర్హత కలిగిన కంపెనీలకు లైసెన్స్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఐసీఎంఆర్ ప్రకటించింది. ఆయా కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ(ఈఓఐ) దరఖాస్తులను ఆహ్వానించింది.



# వరంగల్‌లో క్రీడా పాఠశాల ఏర్పాటుకు సీఎం రేవంత్ గ్రీన్‌సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ చాలాసేపు మాట్లాడారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఒక్క స్టేడియం మాత్రమే ఉందని, జిల్లా క్రీడా అథారిటీ ఆధ్వర్యంలో వివిధ క్రీడల నిర్వహణకు ఉపయోగపడుతోందని, శిక్షణ కోసం కూడా ఉపయోగిస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు సీఎంకు వివరించారు.

వరంగల్ అన్ని వైపులా విస్తరిస్తున్న నేపథ్యంలో జనాభా పెరుగుతోందని, ఇందుకు అనుగుణంగా క్రీడా సేవల విషయంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం అవసరాలను తీర్చలేకపోతోందని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు తెలంగాణ క్రీడా పాఠశాలను మంజూరు చేయడం ద్వారా ప్రత్యేక క్రీడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించొచ్చని, ఈ పాఠశాలు ఏర్పాటుకు అవసరమైన 20 ఎకరాల ప్రభుత్వ భూమి ధర్మసాగర్ మండలం ఉనికిచర్లలో అందుబాటులో ఉందన్నారు. వరంగల్‌కు చెందిన విద్యార్థులు క్రికెట్ ఆడటానికి ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో క్రికెట్ కోసం ప్రత్యేక స్టేడియం ఏర్పాటు చేయాలని కూడా కోరారు. క్రీడా పాఠశాలతోపాటు ప్రత్యేక క్రికెట్ స్టేడియాన్ని వీలున్నంత త్వరగా మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి క్రీడా పాఠశాలతో పాటు ప్రత్యేక క్రికెట్ స్టేడియం ఏర్పాటుతో పాటు జిల్లా అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు.

**ఆసక్తికర భేటీ**

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు, మంత్రి కొండా సురేఖ దంపతులకు విభేదాలు వచ్చిన నేపథ్యంలో కొందరు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ ప్రత్యేకంగా భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల సీఎం రేవంత్ మంత్రి సురేఖ, ఆమె కుమార్తె సుస్మితా పటేల్‌తో తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు.

ఇప్పుడు ఆమెను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలతో భేటీ కావడంతో ఈ సమావేశంలో రాజకీయంగా ఏం చర్చ జరిగిందన్నది ఆసక్తి నెలకొంది. ఇరుపక్షాలకు సర్దిచెప్పేందుకే రేవంత్ విడివిడిగా ఉమ్మడి వరంగల్ నేతలతో సమావేశమయ్యారని, వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలను కొంతకాలం పక్కనపెట్టేలా ఈ భేటీలో చర్చలు జరిగాయని తెలుస్తోంది.

# పంచాయతీరాజ్ తాత్కాలిక ఈఎన్‌సీగా ఎన్. అశోక్ నియామకం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం తాత్కాలిక ఇంజనీరింగ్ ఇన్ ఛీఫ్ గా ఎన్.అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. అశోక్ ప్రస్తుతం క్వాలిటి కంట్రోల్ చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఈఎన్‌సీగా ఉన్న కనకరత్నం ఎసీబీకి పట్టుబడటంతో ఆయనను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో కొత్తగా అశోక్ నియమితులయ్యారు. అయితే అశోక్‌కు ఇంఛార్జిగా కానీ ఎఫ్ఏసీగా కానీ పదాన్ని వాడకుండా లుక్ ఆఫ్టర్ అంటూ ఆదేశాల్లో పేర్కొన్నారు.

అశోక్ వచ్చే సెప్టంబర్‌లో రిటైర్ కానున్నారు. అందు కోసమే ఆయనకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించలేదని సమాచారం. ఆదివారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. కామారెడ్డి జిల్లాకు చెందిన అశోక్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసి, సూరత్‌లో ఎంటెక్ అభ్యసించారు. 1989లో నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షలో అర్హత సాధించి పంచాయతీరాజ్ విభాగంలో ఏఈఈ నియమితులయ్యారు.

# సొంత పార్టీ నేతలే వెన్నుపోటు పొడిచారు

(మొదటి పేజీ తరువాయి)



హుజూరాబాద్‌లో ఈటలకు చెక్ పెట్టే విధంగా మంత్రి వ్యవహరిస్తున్నారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈటల వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

2023 ఎన్నికల్లో హుజూరాబాద్ నుంచి తాను పోటీ చేసినప్పుడు.. సొంత పార్టీ నాయకులే తనకు వెన్నుపోటు పొడిచారని ఈటల వ్యాఖ్యానించారు. అయినా.. తాను ప్రజల మనసులు గెలుచుకుని ఎంపీగా విజయం దక్కించుకున్నానన్నారు. వ్యక్తుల పై తాను ఎప్పుడూ ఆధారపడలేదన్న ఆయన.. పార్టీని, ప్రజలను మాత్రమే నమ్ముకున్నానని చెప్పారు. కార్యకర్తలే తనకు కొండంత బలమని ఈటల వ్యాఖ్యానించారు. వారిని కూడా తనకు దూరం చేసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని చెప్పారు.

తనపైనా.. తన కుటుంబంపైనా కూడా.. సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం చేస్తూ.. తన ఇమేజ్‌కు భంగం కలిగించేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అయితే..ఎక్కడా ఎవరి పేరును ఈటల ప్రస్తావించలేదు. బీఆర్ఎస్ నుంచి బయటకు రావడానికి చాలానే కారణాలు ఉన్నాయన్నారు. అయితే..ఎక్కడ ఉన్నా.. ఆ పార్టీ బాగుండాలని.. కార్యకర్తలు ప్రజలు బాగుండాలని తాను కోరుకుంటానని ఈటల వ్యాఖ్యానించారు. తాను పదవుల కోసం ఎప్పుడూ వెంపర్లాడలేదన్నారు. పదవుల కోసం పార్టీలు మారలేదని చెప్పారు.

"గతంలో సీఎంగా ఉన్న కేసీఆర్‌కు నా నిర్ణయాలు మొహమాటం లేకుండా చెప్పాను. గతంలో హుజూరాబాద్ ఉపఎన్నికల్లో ప్రజల ఆత్మగౌరవం గెలిచింది. నేను అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో పనిచేస్తున్నా. కానీ.. కొందరికి ఇది నచ్చడం లేదు. అయినా.. నేను ప్రజలనే నమ్ముకున్నా.. నా కార్యకర్తలే నాబలం" అని ఈటల తేల్చి చెప్పారు.





# మొక్కలు నాటాలి.. పర్యావరణాన్ని కాపాడాలి..

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

దేశవ్యాప్తంగా చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ ఉద్యమం నిర్వహిస్తుంది దాని లో భాగంగా ఖమ్మం లో అనేక ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. . జమాఅతె ఇస్లామి హింద్ ఖమ్మం నార్త్ మరియు సౌత్ సిఐఓ ఆధ్వర్యంలో మిషన్ ప్లాంటేషన్లో భాగంగా ఆదివారం వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను సందర్శించటం జరిగింది ఈ కార్యక్రమంలో సిఐఓ పిల్లలకు అనేక మొక్కల ప్రాముఖ్యతను తెలియజేస్తూ అనేక మొక్కలను పరిచయం చేయడం జరిగింది. అంతేకాక సి ఐ ఓ ఆధ్వర్యంలో పార్కుకు సందర్శించిన సందర్శకులకు మొక్కల పెంపకం పై అవగాహన కల్పిస్తూ ప్లే కార్డ్స్ ను, ఫ్లెక్సీలను ప్రదర్శించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా జమాతే ఇస్లామీ హింద్ చేపట్టిన మిషన్ ప్లాంటేషన్ లో భాగంగా దేశవ్యాప్తంగా 10 లక్షల మొక్కలను నాటే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా నెల రోజులపాటు అనేక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి అందులో భాగంగానే ఆదివారం ఖమ్మం లో సి ఐ ఓ మెంబర్స్ మొక్కలు నాటడంతోపాటు ప్రజల్లో అవగాహన పెంచే అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం . జమాఅతె ఇస్లామి హింద్ నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, ఐట రీజినల్ సెక్రెటరీ మొహమ్మద్ ముజీబ్, నార్త్ అధ్యక్షురాలు హుస్సేన్ బీ, సౌత్ అధ్యక్షురాలు నాజియా, సిఐఓ ఇంచార్జ్ జహీరా, మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పిల్లలు పాల్గొన్నారు.





# చెర్లపల్లిలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు:**

ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని చెర్లపల్లి డివిజన్లో భక్తిశ్రద్ధలతో పండుగ సంబరాలు కొనసాగుతున్నాయి. కుషాయిగూడ పోచమ్మ ఆలయం, నల్ల పోచమ్మ ఆలయం, ముత్యాలమ్మ దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు.ఈ ఉత్సవాలలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు మాజీ కార్పొరేటర్ సింగి రెడ్డి ధనపాల్ రెడ్డి, సీతారాం రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సింగి రెడ్డి వెంకట్ రెడ్డి, మెర్పెట్, హెచ్‌బీ కాలనీ అధ్యక్షులు పోలెపాక అంజయ్య, ఏఎస్ రావు నగర్ అధ్యక్షులు కాశెట్టి ప్రసాద్, శ్రీనివాస్ ముదిరాజ్, విఠల్ నాయక్, ఉదయ్, సురేష్, మల్లికార్జున్, సురేశ్ గౌడ్, జెమిని, లింగం, సుంకు శ్రీకాంత్ రెడ్డి, సునీత, భూపాల్ రెడ్డి, అజీజ్, నర్సింహ, సుజీత్ రెడ్డి, సాకేత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.
డివిజన్ కాంగ్రెస్ కమిటీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఉత్సవానికి మరింత శోభను చేకూర్చారు.




## ఘనంగా పూడూరి జితేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు:**

బీఆర్ఎస్ పార్టీ ఉప్పల్ సీనియర్ నాయకుడు పూడూరి జితేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఉప్పల్‌లోని రామస్వామి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంటు ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి హాజరై జితేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉప్పల్ ప్రాంతంలోని వివిధ కాలనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన వేళ, కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.






## తల్లాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా ఎండీ బహదూర్ ఎన్నిక..

◆ 24న వైరాలో జరిగే టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా సభను జయప్రదం చేయాలి..

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



తల్లాడ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్ ఎండీ బహదూర్ ఎన్నికయ్యారు. ఆదివారం తల్లాడలో జరిగిన జర్నలిస్టుల సమావేశంలో ఆయనను అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా బహదూర్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన వైరాలో జరిగే టియు డబ్ల్యూజే (ఐజేయు) జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డితో పాటు జిల్లా మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు హాజరవుతారని వెల్లడించారు. జర్నలిస్టులు ఐక్యతగా ఉండి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన అధ్యక్షులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు దాసరి శ్రీనివాసరావు, కె సురేందర్ రెడ్డి, గొడ్ల బాబురావు, దేవబత్తిని సీతారాములు, ఇస్నపల్లి శ్రీనివాసరావు, కొత్తపల్లి విజయ్, నారపోగు ప్రసాద్, గొల్లమందల ప్రేమ్ కుమార్, గొడ్ల నరసింహారావు, బోనాసీ శ్రీనివాసరావు, రేగళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు:**

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా, ఏఎస్ రావు నగర్ డివిజన్‌లలో భక్తిశ్రద్ధలతో పండుగ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా న్యూ శ్రీనివాస్ నగర్ పోచమ్మ దేవాలయం, ఎల్లారెడ్డిగూడ, సాయిరాం కాలనీలోని పోచమ్మ ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శివమణి స్వర్ణరాజ్, అంజి రెడ్డి, డివిజన్ అధ్యక్షులు నాగశేషు, ఏఎస్ రావు నగర్ అధ్యక్షులు కాశెట్టి ప్రసాద్, నాగరాజు, పాకాల రాజు, అల్లూరయ్య, నరసింహ, విఠల్ నాయక్, లింగం, సుంకు శ్రీకాంత్ రెడ్డి, భూపాల్ రెడ్డి, అజీజ్, నర్సింహ, పూర్ణ యాదవ్, రాకేష్ యాదవ్, తోటకూర శ్రీకాంత్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. డివిజన్ కాంగ్రెస్ కమిటీ సభ్యులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈ ఉత్సవాల్లో పాల్గొని కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.





## నాగరిక్ వికాస్ కేంద్ర సేవలను సద్వినియోగం చేసుకోండి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మంలోని అజీజ్ గలీ లో గల నాగరిక వికాస్ కేంద్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్.వి.కె స్టేట్ ఆపరేషన్ మేనేజర్ మహమ్మద్ జునేద్ పిలుపునిచ్చారు. ఆదివారం యూనిట్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ముజీబ్ అధ్యక్షతన జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని తగు సూచనలు ఇచ్చారు. నాగరిక వికాస కేంద్ర లో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు అనేక సేవలు ఉచితంగా ఆన్లైన్ చేయబడతాయన్నారు. అయితే ఈ సమాచారాన్ని ప్రజల్లో తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్.వి.కె యూనిట్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ముజీబ్ మాట్లాడుతూ ఎన్.వికేలో అనేక రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని వీటిని ప్రజలు కులమతాలకతీతంగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, ఆధార్ కార్డ్ కరెక్షన్స్, ఓటర్ ఐడి, పాన్ కార్డ్ ,విద్యార్థుల స్కాలర్షిప్స్, ఆయుష్మాన్ భారత్ కార్డ్, తదితర సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.వి.కె మేనేజింగ్ కమిటీ సభ్యులు అబ్దుల్ మలిక్, మహమ్మద్ యాకుబ్ పాషా, అబ్దుల్ సలాం, కోఆర్డినేటర్ ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.



## ఉండ్రు శ్యాం బాబుకు ఇంటర్నేషనల్ ప్రెసి డెంటల్ మెడల్ అవార్డ్

**జిఎస్టి కోఆర్డినేటర్ అవార్డ్**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

వైరా లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు 2024.25 సంవత్సరానికి గాను జిఎస్టి కోఆర్డినేటర్ లయన్ ఉండ్రు శ్యాం బాబుకు ఆదివారం నల్లగొండలో జరిగిన 24 25 సంవత్సరానికి గాను ప్రజ్ఞ అవార్డు ఫంక్షన్లో అలనాటి గవర్నర్ యారాల ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా ఇంటర్నేషనల్ ప్రెసి డెంటల్ మెడల్ అవార్డును మరియు జీఎస్టీ కోఆర్డినేటర్ అవార్డును అందుకున్నారు అవార్డు అందుకోవటం పట్ల ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపామురళీ కృష్ణ జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు రీజియన్ సెక్రటరీ పెనుగొండ ఉపేందర్రావు క్లబ్బు ఎల్సిఐఎఫ్ కోఆర్డినేటర్ చింతలపూడి వెంకటేశ్వరరావు క్లబ్బు మహిళా కోఆర్డినేటర్ మాదినేని సునీత జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి వనమా విశ్వేశ్వరరావు నూకల శ్రీనివాసరావు నూకల ప్రసాద్ రావు గజ్జల కృష్ణమూర్తి తోటకూర శ్రీకాంత్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై బుచ్చి రామారావు ఉపాధ్యక్షులు రంగా సత్యనారాయణ ఏపూరి రాజారావు పీ ఆర్వో పులి కృష్ణార్జునరావ్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు ట్రెజరర్ గద్దె నీరజ జీఎస్టీ కోఆర్డినేటర్స్ కొల్లాn రాంబాబు షేక్ లాల్ అహ్మద్ కన్యధారి హనుమాయమ్మ క్లబ్ సభ్యులు మిట్టపల్లి సత్యంబాబు మాదినేని దుర్గాప్రసాద్ పుప్పాల అనంతరామయ్య నల్లమోతు లక్ష్మీనారాయణ మరికంటి రాంగోపాల్ కట్ల సురేష్ తాటికొండ రాము తదితరులు హర్షం ప్రకటించారు



## ఎన్ఎఫ్‌సీ నగర్‌లో భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

**ఘట్‌కేసర్, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్రం గర్వంగా చెప్పుకోదగిన సాంస్కృతిక సంప్రదాయాల్లో ముఖ్యమైనది బోనాల పండుగ. ఈ పర్వదినాన్ని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్, బొక్కోనిగూడ, చందుపట్లగూడ ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలైన చిత్తారమ్మ, పోచమ్మ ఆలయాల వద్ద భక్తులు, మహిళలు పూజలతో వాతావరణాన్ని ఆధ్యాత్మికతతో నింపారు. అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ శివశత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామాల్లో ఊరేగింపులు జరిపి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సాహాన్ని పెంచారు.ఈ వేడుకల్లో మాజీ కౌన్సిలర్లు చందుపట్ల అశ్వని వెంకటరెడ్డి, కొమ్మగోని రమాదేవి, మహిపాల్ గౌడ్, బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జంపాల రమేష్, బీఆర్ఎస్ నేతలు విష్ణువర్ధన్ రెడ్డి, లింగస్వామి, సుధాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, అల్వ వీరారెడ్డి, స్థానిక నాయకులు వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


## బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్‌గా ననుబాల చంద్రమౌళి నియామకం



ధర్మసాగర్, తెలంగాణ ముచ్చట్లు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. పార్టీ బలోపేతం కోసం నేతలు, కార్యకర్తలతో సమన్వయం కోసం మండల స్థాయిలో కీలక పదవుల బాధ్యతలు అప్పగిస్తూ నియామకాలు చేపట్టింది.
ఈ క్రమంలో మండలానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు ప్రభుదాస్,కర్ర సోమిరెడ్డిలను నియోజకవర్గ పరిశీలకులుగా, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్‌గా తాటికాయల గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ననుబాల చంద్రమౌళిని నియమించారు.
ఆయనతో పాటు మండల ఇంచార్జ్‌లుగా మునిగల రాజు,లాల్ మహ్మద్, కన్వీనర్‌గా మామిడి రవీందర్, కోఆర్డినేటర్‌లుగా అనంతపురం కమలేష్, కుర్సపల్లి రమేష్‌లు,ధర్మసాగర్ గ్రామ కన్వీనర్ గా బొడ్డు ప్రతాప్,నియోజకవర్గ మహిళా ఇంచార్జ్ లుగా బొడ్డు శోభ సోమయ్య,భైరపాక పద్మ జోజి,మాచర్ల నీల లను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే రాజయ్య ప్రకటించారు.
కన్వీనర్ గా బాధ్యత లభించిన సందర్భంగా ననుబాల చంద్రమౌళి మాట్లాడుతూ పార్టీ విధేయుడిగా, సీనియర్ నాయకుడిగా తమకు ఇచ్చిన గౌరవాన్ని అభిమానం గా భావిస్తున్నానని, ఈ అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ విజయానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# ఈస్ట్ బాలాజీహిల్స్‌లో భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు

బోడుప్పల్, తెలంగాణ ముచ్చట్లు: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని బోడుప్పల్ నగరపాలక సంస్థ 21వ డివిజన్‌లోని ఈస్ట్ బాలాజీహిల్స్ కాలనీ శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయంలో బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించారు.ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల జాతరలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, స్థానిక మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ పాల్గొన్నారు. అలాగే, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, రాసాల వెంకటేష్ యాదవ్, చీరాల నరసింహ, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, బొమ్మక్ కళ్యాణ్, బొమ్మక్ బాలయ్య, కృపాసాగర్ ముదిరాజ్, మోదుగు శేఖర్ రెడ్డి, గుర్రాల వెంకటేష్ యాదవ్, జక్కల జయరాములు, వెంకటేష్ గుప్తా, దానగళ్ళ యాదగిరి, హరినాథ్ రెడ్డి, మోదుగు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.డివిజన్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బోనాల వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.





# బోనం సమర్పించిన కార్పొరేటర్ బన్నాల గీత

- ఉప్పల్ ప్రజల శ్రేయస్సుకై ప్రార్థనలు

ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు: ఆషాడ మాస బోనాల పండుగను పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్‌లో కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ కుటుంబ సమేతంగా బ్యాంక్ కాలనీలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా గీత ప్రవీణ్ మాట్లాడుతూ, ఆషాడ మాస బోనాల సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించడం ఎంతో పవిత్రమైన కార్యక్రమమని, అమ్మవారి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వంటి నాయకులపై అమ్మవారి కృప కటాక్షం ఉండాలని ప్రార్థించారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్ గీత ప్రవీణ్‌ను శాలువాతో సత్కరించి బోనాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశం, బాబున్న, సందీప్, భూషణ్, శ్రీనివాస్, మనోజ్, రమేష్, శేఖర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో కొనసాగించారు.







## మాజీ జడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించిన మందకృష్ణ మాదిగ

వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు: పెద్దమందడి మండల మాజీ జడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పరామర్శించారు . కొమ్ము వెంకటస్వామి తండ్రి కొమ్ము పెద్ద నరసింహ అనారోగ్యంతో మృతి చెందారు....విషయం తెలుసుకున్న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పెద్దమందడి లోని వారి ఇంటి దగ్గరకు వచ్చి, వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.!గతంలో కొమ్ము వెంకటస్వామి ఎస్సీ వర్గీకరణ కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొని ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేశారని ఆయన సేవలను గుర్తించిన మందకృష్ణ మాదిగ కొమ్ము వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించి దైర్యం చెప్పారు ...ఈ సందర్భంగా కొమ్ము పెద్ద నరసింహ ఫోటోకు పులతో నివాళులు అర్పించారు... ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి, వారి కుటుంబం సభ్యులు, వనపర్తి జిల్లా ఇన్చార్జి టైగర్ జంగయ్య,వనపర్తి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చెన్నకేశవులు, కొమ్ము చెన్నయ్య జిల్లా నాయకులు, కనయపల్లి ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాసులు,జిల్లా నాయకులు మైబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పురుషోత్తం, జిల్లా నాయకులు ముప్పారి సురేష్,సింగిరెడ్డి కురుమూర్తి,కొమ్ము రాములు,కొమ్ము సాయిబాబు టీచర్ మాజీ ఎంపీటీసీ యం బుచ్చన్న,యం భీమన్న,యం చిన్న బుచ్చన్న,ఏస్ ఆంజనేయులు,కొమ్ము బ్రహ్మయ్య, కొమ్ము నరసింహులు,కొమ్ము స్వామి గ్రామ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

# "చలో.. సిద్దిపేట"ను విజయవంతం చేయండి

- -భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి



ధర్మసాగర్, తెలంగాణ ముచ్చట్లు: ఈ నెల 28న సిద్దిపేటలో జరగనున్న తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మికుల మహా గర్జన సభను విజయవంతం చేయాలని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి పిలుపునిచ్చారు. ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామంలో ఆదివారం నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మహా గర్జన సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా నల్ల స్వామి మాట్లాడుతూ, "తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మహా గర్జన సభకు హాజరవుతుండడం రాష్ట్ర కార్మిక లోకానికి శుభ సూచక పరిణామం. ఎన్నాళ్లుగా కార్మికులు ఎదురుచూస్తున్న ఉపాధి, సంక్షేమం, భద్రతల సాధనకు ఇది తొలి అడుగు" అని పేర్కొన్నారు.
తెలంగాణలోని భవన నిర్మాణ రంగ కార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో అతి తక్కువ వేతనంతో పనిచేస్తూ, అనేక అవాంతరాలను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. నైపుణ్యం, నిబద్ధతను చాటినా, వారి సంక్షేమంపై ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగుతుందన్నారు.
భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు 11 ఏళ్లుగా చైర్మన్ లేకుండా పనిచేయడం, బోర్డు నిధుల వినియోగంలో అవకతవకలు, పరీక్షల పేరిట కార్మికులపై జరుగుతున్న అన్యాయాన్ని గుర్తు చేస్తూ, దీనిపై ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
కార్మికుల హక్కుల కోసం మహా గర్జన సభకు పెద్దఎత్తున హాజరై ఆందోళనను బలపర్చాలని కార్మికులను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లెపాక యాదగిరి, సంఘ నాయకులు పట్ల శ్రీనివాస్, పట్ల యాకుబ్, నల్ల రమేష్, నల్ల వెంకట్రాజం, పట్ల యాదగిరి, బొల్లెపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ కంపెనీలపై ప్యానెల్ ఏర్పాటు




బీమా సంస్థలు, మధ్యవర్తులు నిబంధనల ఉల్లంఘనలపై దృష్టి సారించేందుకు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ప్యానెళ్లను ఏర్పాటు చేసింది. ఐఆర్‌డీఏఐ 132వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. బీమా చట్టం, నియంత్రణపరమైన మార్గదర్శకాలను బీమా కంపెనీలు సరిగ్గా పాటిస్తున్నాయా? ఎక్కడైన ఉల్లంఘనలు చోటు చేసుకుంటున్నాయా? అన్నది పరిశీలించేందుకు పూర్తికాల సభ్యులతో కూడిన ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఐఆర్‌డీఏఐ ప్రకటించింది.
పాలసీలను తప్పుడు మార్గాల్లో విక్రయిస్తుండడం, డేటా లీకేజీ నివేదికల నేపథ్యంలో ఐఆర్‌డీఏఐ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కివి జనరల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి ఆర్1 దరఖాస్తుకు సైతం తాజా సమావేశంలో ఐఆర్‌డీఏఐ ఆమోదం తెలిపింది. దీని తర్వాత ఆర్2, ఆర్3 స్థాయిలోనూ ఆమోదం పొందాల్సి ఉంటుంది.

# మహిళలకు ఆర్థిక అండగా నిలుస్తున్న తెలంగాణ సర్కార్

- గతంలో ఇసుక మాఫియా ద్వార కోట్ల ఆదాయం మాయం
- కోట్ల ఆదాయాన్ని కాపాడుతున్న మహిళా సంఘాలు

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు: మహిళలు ఆర్థికంగా, సామాజికంగ బలోపేతం చేసేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ( సేర్ప్) వివిధ పథకాలను అమలు చేస్తుంది స్వయం సహాయక సంఘాల ( ఎస్ హెచ్ జీలు) లో సభ్యులైన వారికి చేయూతనిస్తుంది.. చాలా సంఘాలు మహిళలు ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నారు ఇటీవలే సర్కార్ స్వయం సంఘాలకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేసింది. వివిధ కారణాలతో మృతి చెందిన సంఘాల్లోని సభ్యులకు లోను బీమా, ప్రమాద బీమా, మంజూరు చేస్తుంది..
మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఉందిరా మహిళ శక్తి పథకలను ప్రవేశపెట్టింది ప్రభుత్వం అన్ని పథకాల మహిళల పేరు మీదనే అమలు చేస్తూ , మహిళలకు లక్షల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తూనది మహిళల ఆర్థిక అభివృద్ధికి స్త్రీ టీ సెంటర్లు, (షి)జిరాక్స్ సెంటర్లో, ఆర్టిసి అద్దె బస్సులు వివిధ రకాలలను మహిళ సంఘాలకు అందజేస్తున్నారు... అలాగే చింతకాని మండలంలోని చిన్నమండవ గ్రామంలో ఇసుక ర్యాంపుల్లోని మహిళా సంఘాలకు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ ఆదాయం కాపాడుతూ ఇసుక అక్రమ రవాణా కి అడ్డుకట్ట వేశారు ... గతంలో ఇసుక అక్రమ రవాణా అనేది భారీగా జరిగేది రెవెన్యూ పోలీస్ వ్యవస్థల వల్ల కూడా ఇసుక అక్రమ రవాణా ఆపడం ఎవరి తరం కాలేదు, తెలంగాణ సర్కార్ మహిళ సంఘాలకు (ఎస్ హెచ్ జీలు ) ఇసుక ర్యాంపులను ఇవ్వడం ద్వారా అక్రమ రవాణా అనేది కనుమరుగు అయ్యింది.. ప్రతిరోజు ఇసుక రాంపుల దగ్గర మహిళా సంఘాలు (ఎస్ హెచ్ జీలు) ఉంటూ ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడుతున్నారు.....గత కలెక్టర్ ముజ్మిల్ ఖాన్ పర్యటనకు వచ్చినప్పుడు మహిళ సంఘాలకి ఇసుక ర్యాంపులను ఇవ్వడం ద్వారా రాష్ట్రంలోనే చిన్నమండవ గ్రామం ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ ముజ్మిల్ ఖాన్ అన్నారు, సింధు గ్రామ సమాఖ్య (ఎస్ హెచ్ జీలు) సభ్యులను కలెక్టర్ అభినందించారు...
ఈ సందర్భంగా ఏపిఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇసుక రీచ్ లను కేటాయించడంతో ఆదాయం సమకూరుతుంది.. సంఘాలు బలాపేతం అవుతాయి... మహిళల సంఘాలను ప్రతి పథకంలోనూ ప్రభుత్వం అవకాశం ఇస్తూ బలోపేతం చేస్తుందని, మండలంలో స్త్రీ టీ సెంటర్లు, జిరాక్స్ సెంటర్స్ మంజూరు చేశామని అన్నారు...
సీసీ నరేందర్ రెడ్డి మాట్లాడుతు ఇసుక ర్యాంపుల దగ్గర మహిళకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని , రెవెన్యూ , పోలీసు సహకారంతో ముందుకు వెళ్తున్నామని అలాగే మహిళా శక్తి ద్వారా గ్రామంలో సిఎస్సి సెంటర్ ఏర్పాటు చేయటం మరియు మహిళలు ఉత్పత్తులును మహిళ మార్టు ద్వార విక్రయించడం జరుగుతుంద అన్నారు....




## ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినికి పాముకాటు

తెలంగాణ ముచ్చట్లు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని గౌరారం ఆశ్రమ పాఠశాలలో ఆరవ తరగతి విద్యార్థిని నవ్యశ్రీకి ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా పాము కాటు వేసిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. ఈ ఘటనను గమనించిన తోటి విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించడంతో నవ్యశ్రీని తక్షణమే దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది తొలి చికిత్స అందించిన అనంతరం, మెరుగైన వైద్య సేవల కోసం నవ్యశ్రీని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.



అక్కడ వైద్యులు నిర్వహించిన వివిధ పరీక్షల్లో ఆమెకు ఎటువంటి ప్రమాదం లేదని నిర్ధారించారు. సకాలంలో చికిత్స అందడంతో నవ్యశ్రీ పూర్తిగా కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన తర్వాత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోతీర్, వార్డెన్ లక్ష్మీపతి, ఉపాధ్యాయులు, నవ్యశ్రీ తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సిందూర్‌పై చర్చకు సై..

న్యూఢిల్లీ. (తెలంగాణ ముచ్చట్లు)

పాకిస్తాన్ ఉగ్రవాదుల భరతం పట్టేందుకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సహా కీలక అంశాలపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 21వ తేదీ వరకు కొనసాగుతాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తర్వాత జరుగుతున్న ఈ సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశం కనిపిస్తోంది. పార్లమెంట్ లేవనెత్తాల్సిన కీలక అంశాలపై విపక్షాలు కసరత్తు పూర్తిచేశాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమయ్యాయి. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనపై వర్షాకాల సమావేశాల్లో తీర్మానం ప్రవేశపెట్టబోతున్నారు.



**నిర్మాణాత్మక చర్చలకు సహకరించాలి**

వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు, ఉభయ సభల్లో నిర్మాణాత్మక చర్చలు జరిగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా అధ్యక్షతన ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, అర్జున్‌రామ్ మేఘ్వాల్, మురుగన్‌తోపాటు కాంగ్రెస్ ఆర్జేడీ, జేడీ(యూ), సమాజ్‌వాదీ పార్టీ, వైఎస్సార్‌సీపీ, డీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్, టీఎంసీ, బీఆర్ఎస్, శివసేన(షిండే), ఆమ్ ఆద్మీ తదితర పార్టీల సభ్యులు హాజరయ్యారు. విపక్షాలు తమ ఎజెండాను ప్రస్తావించాయి. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, పహల్గాం ఉగ్రవాద దాడి, భారత్-పాక్ ఘర్షణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను లేవనెత్తాయి. పొరుగు దేశాలతో విదేశాంగ విధానం, తాజా పరిస్థితులపై పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేశాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల కష్టాలు, దేశ ఆర్థిక వ్యవస్థ, మణిపూర్ అంశాలపై పూర్తిస్థాయిలో చర్చించాలని కోరాయి.

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చ చేపట్టాలని డీఎంకే అభ్యర్థించింది. అఖిలపక్ష భేటీ అనంతరం కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మీడియాతో మాట్లాడారు. భారత్-పాక్ మధ్య యుద్ధం ఆపేశానంటూ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దుశ్చర్యకు దారితీసిన భద్రతా లోపాలు, బిహార్‌లో ఓట్ల జాబితా సవరణపై ప్రధాని మోదీ మాట్లాడాలని కోరినట్లు తెలిపారు.

అఖిలపక్ష భేటీ నుంచి వస్తున్న కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, ఎంపీలు జైరాం రమేశ్ తదితరులు

**కొత్త బిల్లులు**

వర్షాకాల సమావేశాల్లో కేంద్రం 8 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. మణిపూర్ వస్తువులు, సేవల పన్ను(సవరణ) బిల్లు, జన్ విశ్వాస్(నిబంధనల సవరణ) బిల్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు, పన్నుల చట్టాలు (సవరణ) బిల్లులతో పాటు జియోహెరిటేజ్ సైట్స్, జియో-రెలిక్స్(సంరక్షణ), జాతీయ క్రీడా పాలన బిల్లు, జాతీయ డోపింగ్ నిరోధక(సవరణ) బిల్లులను ప్రవేశపెట్టనుంది.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించడానికి ప్రభుత్వం పార్లమెంట్ ఆమోదం కోరనుంది. వీటితోపాటు పెండింగ్‌లో ఉన్న సముద్ర వస్తువుల రవాణా బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, ఓడరేవుల బిల్లులపై చర్చించి, ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి.

**చర్చకు వెనుకాడం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు**

ఆపరేషన్ సిందూర్ సహా జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కలిగిన కీలక అంశాలపై పార్లమెంట్‌లో చర్చకు వెనుకంజ వేసే ప్రసక్తే లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. విపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇస్తామన్నారు. అఖిలపక్ష భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలు ఎలాంటి అంతరాయాలు లేకుండా సజావుగా కొనసాగేందుకు అధికార, విపక్ష సభ్యులు కలిసికట్టుగా పని చేయాలన్నారు.

వర్షాకాల సమావేశాలు ఫలవంతం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పార్టీలకు, కూటములకు వేర్వేరు సిద్ధాంతాలు ఉన్నప్పటికీ పార్లమెంట్ కార్యకలాపాలకు సహకరించాల్సిన బాధ్యత అన్ని పక్షాలపైనా ఉందన్నారు. ఉభయ సభల్లో మాట్లాడేందుకు ఎక్కువ సమయం ఇవ్వాలని చిన్న పార్టీల ఎంపీలు కోరారని, అందుకోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

చిన్న ఎంపీలకు తగినంత సమయం ఇవ్వాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు మినహా మిగతా సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ సమావేశాలకు హాజరవుతారని కిరణ్ రిజిజు వెల్లడించారు. విపక్షాలు లేవనెత్తే అంశాలపై సంబంధిత కేబినెట్ మంత్రులు సమాధానం ఇస్తారని స్పష్టంచేశారు. 17 బిల్లులు ప్రవేశపెట్టబోతున్నామని, వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.



## 23 నుంచి మోదీ విదేశాల పర్యటన

న్యూఢిల్లీ. (తెలంగాణ ముచ్చట్లు)

ప్రధాని మోదీ బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు యూకే, మాల్దీవుల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భారత్‌యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదరనుంది. ముందుగా ఈనెల 23, 24 తేదీల్లో ప్రధాని యూకేలో పర్యటిస్తారు. అక్కడ బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో విస్తృతస్థాయి చర్చలు జరుపుతారు. ఈ సందర్భంగా భారత్‌యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకం చేస్తారు. యూకే పర్యటన తర్వాత మోదీ మాల్దీవులకు వెళ్తారు. అక్కడ 26న జరిగే 60వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు 2023లో అధికారంలోకి వచ్చాక మోదీ అక్కడికి వెళ్లడం ఇదే మొదటిసారి. గతేడాది మోదీపై, లక్షదీవులపై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో పాటు, చైనా అనుకూల వైఖరి వల్ల ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మాల్దీవులతో మెరుగైన దౌత్యసంబంధాలు, పరస్పర సహకారానికి ఈ పర్యటన దోహదపడుతుందని విదేశాంగ శాఖ భావిస్తోంది.



## అహ్మదాబాద్ ప్రమాదంపై ఏఏఐబీ చెప్పిందే ఫైనల్

న్యూఢిల్లీ. (తెలంగాణ ముచ్చట్లు)

పైలట్ల తప్పిదం వల్లే అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగిందంటూ పశ్చిమ దేశాల(అమెరికా, ఐరోపా) వార్తా సంస్థలు కథనాలను ప్రసారం చేయడాన్ని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ తీవ్రంగా ఖండించారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఊహాజనితమైన వార్తా కథనాలను ప్రసారం చేయవద్దని సూచించారు. విమాన ప్రమాదాల దర్యాప్తు విభాగం(ఏఏఐబీ)పై తనకు పూర్తి విశ్వాసం ఉందని, ఏఏఐబీ తుది నివేదిక వచ్చే వరకు ఎలాంటి నిర్ణయానికి రాకూడదని పేర్కొన్నారు. "విమాన ప్రమాదానికి సంబంధించి ఏఏఐబీ చెప్పిందే ఫైనల్" అని స్పష్టం చేశారు. ఏఏఐబీ తన ప్రాథమిక నివేదికను ఇప్పటికే బహిర్గతం చేసిందని కేంద్రమంత్రి గుర్తుచేశారు. "గతంలో బ్లాక్‌బాక్సులో ఏముందో తెలుసుకోవడానికి విదేశాలకు పంపాల్సి వచ్చేది. మొదటిసారిగా ఇండియాలోనే దాన్ని ఏఏఐబీ డీకోడ్ చేసింది" అని ప్రశంసించారు.

# అన్నార్తులపై ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు

గాజా స్ట్రిప్‌లో మారణహోమం కొనసాగుతూనే ఉంది. ఆహారం, మానవతా సాయం కోసం అల్లాడుతున్న సామాన్య పాలస్తీనా పౌరులను ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యంగా చేసుకుంటోంది. ఆదివారం ఇజ్రాయెల్ జవాన్ల కాల్పుల్లో కనీసం 85 మంది మరణించారు. ఇజ్రాయెల్ భూభాగం నుంచి జికిమ్ క్రాసింగ్ ద్వారా ఉత్తర గాజాలోకి ప్రవేశించిన వాహనాల వద్దకు జనం పరుగెత్తుకొని వస్తుండగా ఇజ్రాయెల్ సైనికులు విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఈ ఘటనలో 79 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 150 మంది గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. వాహనాల్లో చేరవేస్తున్న ఆహారం కోసం జనం ఆరాటపడగా, చివరకు ప్రాణాలే పోయాయి. దక్షిణ గాజాలో జరిగిన కాల్పుల్లో మరో ఆరుగురు బలయ్యారు. సెంట్రల్ గాజా నుంచి జనం బయటకు వెళ్లిపోవాలంటూ ఇజ్రాయెల్ మిలటరీ ఆదివారం హెచ్చరికలు జారీ చేసింది. ఒకవైపు కాల్పుల విరమణ కోసం ఇజ్రాయెల్, హమాస్ మధ్య ఖతార్‌లో చర్చలు కొనసాగుతుండగానే ఈ హెచ్చరికలు వెలువడడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చర్చల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదని మధ్యవర్తులు చెబుతున్నారు.





## 15ఏళ్ల బాలికను కట్టేసి.. పెట్రోల్ పోసి నిప్పు

ప్రొఫెసర్ లైంగిక వేధింపులను భరించలేక ఓ విద్యార్థిని ఆత్మాహుతికి పాల్పడిన ఘటన మరువక ముందే ఒడిశాలో మరో దారుణం జరిగింది. 15 ఏళ్ల బాలికపై ముగ్గురు దుండుగులు పెట్రోల్ పోసి, నిప్పంటించారు. పూరీ జిల్లాలోని బయబర్ గ్రామంలో శనివారం ఈ ఘటన జరిగింది. 70% కాలిన గాయాలతో సదరు బాలిక ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. బాలికకు మెరుగైన వైద్యం కోసం ఆదివారం ఆమెను భువనేశ్వర్ ఎయిమ్స్ నుంచి ఢిల్లీ ఎయిమ్స్‌కు విమానంలో తరలించారు. శనివారం ఉదయం బాలిక తమ ఇంటి నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్తుండగా ముగ్గురు దుండగులు ఆమెను అడ్డగించారు. కిడ్నాప్ చేసి భార్గవ నది ఒడ్డుకు తీసుకువెళ్లారు. అక్కడ ఆమెను కట్టేసి, ఆమె ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో భయపడి పారిపోయారు. పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఒడిసాలో సంచలనం సృష్టించింది. ఘటనపై ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ స్పందిస్తూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు.



## హెచ్–1బీ వీసాకు జాబ్‌తో లింకు!




డొనాల్డ్ ట్రంప్ తొలిసారిగా అధ్యక్షునిగా పాలించిన కాలంలో అమలై తర్వాత బైడెన్ హయాంలో బుట్టదాఖలైన ఒక విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. ట్రంప్ తొలివిడత అమెరికా అధ్యక్షునిగా పరిపాలించిన కాలంలో హెచ్-1బీ వీసాల కోసం లాటరీ విధానాన్ని పక్కనబెట్టి ఆయా కంపెనీలు ఉద్యోగానికి ఇచ్చే జీతభత్యాల ఆధారంగా వీసాలను జారీచేయాలని నిర్ణయించారు.

ఆ విధానాన్నే ఆనాడు అమలుచేశారు. దీంతో కంపెనీలు మరింత మంది ఉద్యోగులను ఉన్నత ఉద్యోగాలకు తీసుకుంటాయని, తక్కువ స్థాయి ఉద్యోగాలు అమెరికన్లకే దక్కుతాయని ట్రంప్ సర్కార్ భావించింది. అయితే విదేశాల నుంచి వచ్చే నిపుణులైన ఉద్యోగులకు అన్ని స్థాయిల ఉద్యోగాలు దక్కాలనే ఉద్దేశంతో జో బైడెన్ సర్కార్ ఈ విధానాన్ని రద్దుచేసి మళ్లీ లాటరీ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇప్పుడు మళ్లీ ఈ లాటరీ విధానానికి స్వస్తిపలికి ఉద్యోగి జీతం, హోదా, పొజిషన్ ఆధారంగా హెచ్-1బీ వీసాలు ఇవ్వాలని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం భావిస్తోంది. ఇందులోభాగంగా సంబంధిత ప్రతిపాదనను సమీక్షించాలంటూ శ్వేత సౌధంలోని ఇన్ఫర్మేషన్ అండ్ రెగ్యులేటరీ అఫైర్స్ ఫర్ రివ్యూ విభాగానికి తన ప్రతిపాదనలను పంపింది.

వాస్తవానికి ప్రతి సంవత్సరం ఎన్ని హెచ్-1బీ వీసాలు జారీ చేయాలనే పరిమితిని అమెరికా కాంగ్రెస్(పార్లమెంట్) నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ప్రతి సంవత్సరం 85,000 హెచ్-1బీ వీసాలను జారీచేస్తున్నారు. వీటిలో 20,000 వీసాలను మాస్టర్స్ డిగ్రీ పట్టా ఉన్న ఉద్యోగులు ప్రత్యేకంగా కేటాయించారు. వీటిలో అత్యధికం అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద కంపెనీలే సాధిస్తున్నాయి. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసి తమ ఉద్యోగుల్లో ఎక్కువ మందికి వీసా దక్కేలా చేస్తున్నాయి. ఇక ఎలాంటి పరిమితి లేని వీసాలను విశ్వవిద్యాలయాల్లోని పరిశోధన విభాగాల కోసం కేటాయించారు.

2026 ఏడాదికి జారీచేయాల్సిన వీసాల కోసం స్వీకరించాల్సిన దరఖాస్తులు సరిపడా రావడంతో వాటి ప్రాసెస్‌ను నిలిపివేశారు. అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ విభాగం శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ లెక్కన 2026 సంవత్సరానికి లాటరీ విధానం ఉండకపోవచ్చని స్పష్టమైంది. పొజిషన్ ఆధారంగా వీసాల జారీ ప్రక్రియలను అమెరికాలోని ఆర్థికరంగ నిపుణులు స్వాగతిస్తున్నారు. అత్యధిక వృత్తి నైపుణ్యాలున్న వ్యక్తులకే అత్యధికంగా హెచ్-1బీ వీసాలు దక్కే అవకాశం ఉండటంతో వారి కృషి, పని ద్వారా అమెరికా ఆర్థికవ్యవస్థ మరింత మెరుగుపడుతుందని వారు ఆశిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నువ్వుల నూనె ప్రయోజనాలు..

నువ్వులకు వంటల్లో ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. వీటితోని ప్రత్యేకమైన వంటకాలు కూడా చేస్తుంటారు. వేసవి వచ్చింది మరీ మీరు పచ్చళ్లు పెండి వంటలు అంటూ ఏమైనా స్పెషల్స్ చేశారా?మరి ఈ వంటకాలకు ఎక్కువగా ఏ నూనెను వాడుతారు?. అయినా వేరే నూనెను ఎందుకు వాడుతారు? నువ్వుల నూనె ఉంది కదా. పచ్చళ్లు అనగానే అందరికీ గుర్తొచ్చేది నువ్వుల నూనె కదా. అద్భుతమైన రుచితోపాటు, ఏడాది పాటు నిల్వ ఉండే పచ్చళ్ల కోసం నువ్వుల నూనెను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. మన కాలంలోనే కాదు అమ్మమ్మల కాలం నుంచే ఈ నువ్వుల నూనె ఆనవాయితీగా వస్తుంది. మరీ ముఖ్యంగా ఎదిగే అమ్మాయిలకు, బాలింతలకు నువ్వులతో చేసిన వంటకాలను, పదార్థాలను తినిపిస్తుంటారు. పచ్చి బాలింత నుంచి ఆరు నెలల వరకు కూడా నువ్వుల నూనెతో వండిన ఆహారాలను అందిస్తారు. అంటే ఏ రేంజ్ లో నువ్వుల నూనెకు ప్రాధాన్యత ఉందో అర్థం చేసుకోండి. ఇక పండుగలు పబ్బాలు వచ్చాయంటే నువ్వుల నూనెతో చాలా వంటకాలు చేస్తుంటారు కదా. మరి మీ ఇంట్లో కూడా ఇవే ఉపయోగిస్తారా? మరో విషయం ఏంటంటే.. ఈ నువ్వుల నూనె ఆరోగ్యానికి మాత్రమే కాదు అందానికి కూడా మెరుగైన ప్రయోజనాలను అందిస్తుందట. ఈ నువ్వులతో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయనే విషయం తెలిసిందే. గుండె జబ్బులు, మధుమేహం, ఆర్థరైటిస్ వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. ఇక ఈ నూనె సౌందర్యపోషణలోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. నువ్వుల నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు, ఓమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బీ, ఈ కాల్షియం, జింక్, ఐరన్, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. అయితే నువ్వుల గింజలలో ఫైబర్ కూడా ఉంటుంది. క్రమం తప్పకుండా నువ్వులు తినడం వల్ల అధిక కొలెస్ట్రాల్ , ట్రైగ్లిజరైడ్‌లను తగ్గించుకోవచ్చు. కండరాల నుంచి హార్మోన్ల వరకు ప్రోటీన్ చాలా అవసరం. ఇక ఈ కొరతను నువ్వుల ద్వారా తీర్చుకోవచ్చు. మరి తెలుసుకున్నారు కదా నువ్వుల నూనెతో ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో సో కాస్త మీ డైట్ లో ఈ నూనెను ఉపయోగించండి.





# బెల్లం, పెరుగు కలిపి తింటున్నారా?

కొందరు డిఫరెంట్ డిఫరెంట్ టేస్టులను ఇష్టపడుతుంటారు. టీ తో పాటు కొందరు బిస్కెట్లు తింటే కొందరు ఏకంగా స్వీట్లు కూడా తింటారు. స్వీట్ టీ కాంబినేషన్ మీకు నచ్చుతుందా? కానీ కొందరికి ఈ కాంబో చాలా ఇష్టం. ఇదిలా ఉంటే కొందరికి పెరుగు బెల్లం కాంబినేషన్ ఇష్టం. దీని వల్ల ప్రయోజనాలు కూడా మెండేనండోయ్..బెల్లం, పెరుగులో దాగివున్న పోషకాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోవడమే కాదు ఇప్పుడే తినాలి అనుకుంటారు. ఈ రెండిరటి కలయిక రక్తహీనత సమస్యకు చెక్ పెడుతుంది. ఈ కాంబినేషన్ ఇమ్యూనిటి పవర్‌ను పెంచేందుకు అద్భుతంగా పనిచేస్తుంది. ఆరోగ్యానికి అవసరమైన అనేక వ్యాధుల నుంచి శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది. ఇక బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయనేది తెలిసిందే. ఇది ఆరోగ్యానికి అవసరమైన కాల్షియం, ఫాస్ఫరస్‌ల మిశ్రమం. మీరు ఒకవేల రోగనిరోధక శక్తి లేక బలహీనంగా ఉంటే, మీరు తరచుగా అనారోగ్యంతో బాధపడుతున్నా.. పెరుగు, బెల్లం తీసుకుంటే చాలు. రోగనిరోధక శక్తి ఇట్టే వస్తుంది.. జలుబు, దగ్గు వంటి వ్యాధులను నివారిస్తుంది ఈ కాంబినేషన్.మీరు రక్తహీనతతో బాధపడుతుంటే పెరుగు, బెల్లం కలిపి రోజూ తింటే శరీరంలో రక్తం పెరిగి రక్తహీనత సమస్య దూరమవుతుంది. జీర్ణవ్యవస్థ సరిగా పని చేయనప్పుడు మలబద్ధకం, కడుపు ఉబ్బరం, వాంతులు వంటి సమస్యలు సర్వసాధారణంగా వస్తుంటాయి. పెరుగు, బెల్లం రోజూ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ కూడా మెరుగుపడుతుంది అంటారు నిపుణులు. బరువు ఎక్కువ ఉన్న వారు కూడా మీ రోజువారీ ఆహారంలో పెరుగు, బెల్లం కలుపుకుని తినటం మంచిది. పెరుగు బెల్లం కలిపి తింటే కడుపు ఫుల్‌గా ఉన్న ఫీలింగ్ వస్తుంది. దీని వల్ల మీకు ఆకలి కూడా వేయదు. అందుకే బరువు పెరిగే అవకాశం కూడా చాలా తక్కువే ఉంటుంది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. పెరుగులో బెల్లం కలిపి తీసుకోవడం వల్ల మహిళలకు పీరియడ్స్ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాదు పీరియడ్స్ సమయంలో దీన్ని తినడం వల్ల కడుపు తిమ్మిర్ల నుంచి కూడా దూరంగా ఉండవచ్చు.

# ఒక్కసారిగా మద్యం మానేస్తే..!

మద్యానికి అలవాటు పడ్డవారు అకస్మాత్తుగా తాగడం మానేస్తే వారి శరీరంలో పలు మార్పులు సంభవిస్తాయని నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న మద్యం ధరల కంటే శరీరం మీద మద్యం చూపించే ప్రభావం చాలా ఎక్కువ. మద్యం వల్ల అనారోగ్యానికి గురైతే ఏమాత్రం ఆలోచించకూడదు. వెంటనే వైద్యులను సంప్రదించాలి. మద్యం రోజూ తాగినా.. అప్పుడప్పుడూ తాగినా.. అది శరీరంలోని కీలక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. మద్యం తాగిన తర్వాత అది నేరుగా పొట్టలోకి వెళ్లి మూత్రం రూపంలో శరీరాన్ని వదిలి వెళుతుందని చాలా మంది భావిస్తారు. అది శరీరంలోకి వెళ్లిన తర్వాత అవయవాల మీద ఎలాంటి ప్రభావం చూపుతుందనే దానిపై చాలా మందికి అవగాహన ఉండదు. ఆల్కహాల్ తాగిన తర్వాత అది పొట్టలోని చిన్న పేగులోకి వెళుతుంది. అక్కడ అది అల్డిహైడ్స్ అనే రసాయనంగా విడిపోతుంది. పొట్ట, పేగుల్లోని రక్తం లివర్ ద్వారా శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుంది. కాలేయం మనం తిన్న



ఆహారంలో పోషకాలను వేరు చేసి రక్తంలో కలిపి, ఆ రక్తాన్ని శరీరంలోని ఇతర భాగాలకు సరఫరా చేస్తుంది. అలాగే ఆహారంలో పనికిరాని వాటిని వేరు చేసి మలం, మూత్రం రూపాల్లో బయటకు పంపిస్తుంది. అల్డిహైడ్ చాలా ప్రమాదకరమైనది. ఇది రక్తం ద్వారా కాలేయానికి చేరుకుని కాలేయాన్ని దెబ్బ తీస్తుంది. అందుకే మీరు తక్కువ కాలంలో ఎక్కువ ఆల్కహాల్ తాగితే శరీరంలో అల్డిహైడ్ల పరిమాణం పెరుగుతుంది. దీంతో కాలేయం పని చేయడం ఆపేస్తుంది. మద్యం తాగడం వల్ల మానసికంగా, శారీరకంగా ప్రభావం పడుతుంది. అయితే అకస్మాత్తుగా మద్యం మానేయడం వల్ల కొంతమందిలో తీవ్రమైన సమస్యలు కనిపిస్తాయి. దీన్ని విత్‌డ్రాయల్ సిండ్రోమ్ అంటారు. మద్యం హఠాత్తుగా మానేసిన తర్వాత కొంతమందిలో టెన్షన్, ప్రకంపనలు, అలసట కనిపిస్తాయి. అదే సమయంలో కొన్నేళ్ల నుంచి మద్యం తాగుతూ, హఠాత్తుగా మానేస్తే మానసిక సమస్యలు తలెత్త వచ్చని వైద్యులు తెలిపారు. కొంతమంది మద్యం తాగడం మానేసిన తర్వాత వారికి చెవుల్లో పెద్ద పెద్ద శబ్ధాలు వినిపిస్తుంటాయి. ఎవరో తమను పిలుస్తున్నట్లు అనిపిస్తుంది. దీన్నే ఆల్కహాల్ ప్రేరేపిత భ్రాంతి అంటారు. ఏళ్ల తరబడి మద్యం తాగుతూ ఏదో ఒక కారణంతో హఠాత్తుగా మానేసినవారిలో మూడు రోజుల్లో మానసిక సమస్యలు తలెత్తుతాయి. అయోమయం, కోపం, తమ ముందు ఏముందో తెలియని పరిస్థితుల్లోకి జారి పోతారు.

# డయాబెటిక్ పేషెంట్లకు అలర్ట్..




కొబ్బరి నీళ్ళు తాగడం ఆరోగ్యానికి మంచిదని వైద్య నిపుణులు ఎల్లప్పుడూ చెబుతుంటారు.. ఎందుకంటే ఇది సహజమైన పానీయం.. టెట్రా ప్యాక్‌లు లేదా సీసాలలో ప్యాక్ చేసిన జ్యూస్‌లు.. శీతల పానీయాల కంటే ఇది చాలా మంచిది. గ్రామాలతో పాటు నగరాల్లోనూ దీన్ని ఎంతో ఇష్టంగా తీసుకుంటారు. ఇవే కాకుండా సముద్ర తీరానికి విహారయాత్రకు వెళ్లినప్పుడల్లా ఈ డ్రిరక్ తాగుతుంటారు.. లేత లేదా ముదురు కొబ్బరి నీరు మనల్ని హైడ్రేట్ చేసి తక్షణ శక్తిని ఇస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు..అయితే మధుమేహ రోగులు కూడా కొబ్బరి నీటిని తాగవచ్చా? లేదా..? అనే సందేహం తరచూ తలెత్తుతుంటుంది. కొబ్బరి నీళ్లలో సహజమైన చక్కెర ఉంటుంది.. కొంచెం తీపిగా ఉంటుంది కాబట్టి, డయాబెటిక్ పేషెంట్లు దీనిని తాగడానికి ఎప్పుడూ భయపడిపోతుంటారు. అయితే.. షుగర్ పేషెంట్లు కొబ్బరి నీరు తాగితే ఏమవుతుంది..? మంచిదా..కాదా..? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకోండి.. డైటీషియన్ల ప్రకారం.. పాల కంటే కొబ్బరి నీటిలో ఎక్కువ పోషకాలు లభిస్తాయి. ఇందులోని కొవ్వు పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది.. క్రమం తప్పకుండా తీసుకునే వ్యక్తులు వారి శరీరంలో పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం.. యాంటీఆక్సిడెంట్లను పొందుతారు. లేత కొబ్బరి నీరు త్రాగడం ద్వారా, శరీరం నుండి టాక్సిన్స్ తొలగిపోతాయి.. ఇది అనేక వ్యాధుల ప్రమాదాన్ని నివారిస్తుంది. డయాబెటిక్ పేషెంట్లు కొబ్బరినీళ్లు తాగవచ్చని డైటీషియన్లు చెబుతున్నారు. ఈ సహజ పానీయాన్ని ప్రతిరోజూ తాగితే.. ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు. గ్లైసెమిక్ ఇండెక్స్ (జిఐ) తక్కువగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. లేత కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కొబ్బరి నీళ్లను తాగడం వల్ల శరీరంలో నీటి లోపం తొలగిపోయి అద్భుతమైన శక్తిని కూడా అందిస్తుంది.

# ఎండాకాలం పాలు తాగితే..



పాలు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. శరీరానికి ఎంతో ముఖ్యమైన అనేక రకాల పోషకాలు పాలలో ఉంటాయి. పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా పాలు తాగడం వల్ల ఎముకలకు బలాన్ని ఇస్తాయని చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు వింటూనే ఉంటాం. అయితే వేసవిలో పాలు తాగితే పొట్టకు వేడి చేస్తుందని, ఎండాకాలంలో పాలు తాగడం పూర్తిగా మానేసేవాళ్ళు కొందరు ఉంటారు. ఈ రోజు మనం వేసవిలో పాలు తాగడానికి సరైన మార్గం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, కడుపులో ఎసిడిటీని కలిగించే అవకాశం ఉన్నందున, ఖాళీ కడుపుతో పాలు ఎప్పుడూ తాగకూడదు. మీరు ఎప్పుడైనా ఖాళీ కడుపుతో పాలు తాగుతున్నట్లయితే, ఖచ్చితంగా దానితో ఏదైనా నట్స్ తినండి. ఇది మీ కండరాలను బలపరుస్తుంది. వేసవిలో, చల్లని పాలు తాగడం ద్వారా మీ రోజును ప్రారంభించండి. ఎందుకంటే వేడి పాలు తాగడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి. అందుకే వేసవిలో వేడి పాలకు బదులుగా చల్లని పాలు తాగాలి. ఇది శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. చలి కాలంలో గోరువెచ్చని పాలు తాగాలి. ఇలా చేయడం వల్ల రోజంతా ఎనర్జిటిక్‌గా ఉంటారు. వ్యాయామం తర్వాత, ఎక్సర్‌సైజ్ సమయంలో పొరపాటున కూడా పాలు తాగవద్దు. అలా కాకుండా మీ వ్యాయామం పూర్తైన అరగంట తర్వాత మాత్రమే పాలు తాగాలి. దీంతో శరీరానికి పుష్కలమైన పోషకాలు అందుతాయి. మీకు జలుబు లేదా ఫ్లూ ఉంటే, పొరపాటున కూడా చల్లని పాలు తాగవద్దు. అటువంటి పరిస్థితిలో గోరువెచ్చని, వేడి పాలు తాగాలి. దీంతో మీరు గొంతు నొప్పి నుండి ఉపశమనం పొందుతారు. అలాగే, రాత్రి నిద్రపోయే ముందు పాలు తాగే అలవాటు ఉంటే చలికాలంలో తప్పనిసరిగా గోరువెచ్చని పాలు తాగాలి. ఇది శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది . చలి నుండి రక్షిస్తుంది. వేడి పాలు జీర్ణ సమస్యలు, కడుపు నొప్పి, గ్యాస్ నుండి దూరంగా ఉండటానికి సహాయపడుతుంది. మీకు నిద్రలేమి ఉంటే, రాత్రిపూట గోరువెచ్చని పాలు తీసుకోండి. పాలలో ఉండే అమినో యాసిడ్లు సెరోటోనిన్ , మెలటోనిన్‌లను నియంత్రించి శరీరానికి నిద్రను దగ్గర చేస్తాయి. చల్లటి పాలు తాగడం వల్ల శరీరం క్యాల్షియం ఎక్కువగా గ్రహిస్తుంది. అయితే నిద్రకు ఉపక్రమించే ముందు చల్లని పాలు తాగకపోవడమే మంచిది. ఇది జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. మీకు జలుబు ఉంటే, చల్లని పాలు తాగవద్దు, దాని వల్ల కఫం, జలుబు ,దగ్గు వస్తుంది. పాలలో లాక్టోస్ పుష్కలంగా ఉంటుంది. అందువల్ల జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. అందుకే పాలు తాగినప్పుడల్లా రాత్రి లేదా ఉదయం తాగండి. మధ్యాహ్నం పొరపాటున కూడా పాలు తాగకూడదని చెబుతున్నారు.

# రోజుకు ఎన్ని అడుగులు నడవాలి..?



నడవడం చాలా మందికి ఇష్టం. భాగస్వామితో కలిసి నడుస్తుంటే ఆ నడక మరింత హ్యాపీగా అనిపిస్తుంది కదా. ఇక ఈ నడక.. మిగతా వాటితో పోలిస్తే తేలికైన వ్యాయామం కూడా అవుతుంది.మనం వేసే ప్రతి అడుగు ఆరోగ్యదాయని అని, మన ఆయుష్షు ను పెంచుతుందని ఇప్పటికే ఎన్నో సార్లు ఎన్నో అధ్యయనాల్లో వెల్లడైంది. ఇంతకీ ఆరోగ్యకర జీవనానికి రోజుకు ఎన్ని అడుగులు వేయాలి? అని ఎప్పుడైనా ఆలోచించారా? ఆ విషయం ఇప్పుడు తెలుసుకుందాం. ఈ విషయం కోసం దాదాపు 2.26లక్షల మందితో 17 వేర్వేరు పరిశోధనలు జరిపారు. అయితే వేసే అడుగుల సంఖ్యను బట్టి విభిన్న ప్రయోజనాలుంటాయని వివరించారు పరిశోధకులు. “రోజుకు దాదాపు 4వేల అడుగులు నడిస్తే అకాల మరణాలకు అరికట్టవచ్చట. ఇది అల్జీమర్స్, డిమెన్షియా వ్యాధుల ముప్పను తగ్గిస్తుంది. అధికబరువు/ఊబకాయం, డయాబెటిస్ వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. 2337 అడుగులతో గుండె సంబంధిత జబ్బులతో మరణించే అవకాశాలు తగ్గుతాయి అని తెలిపింది పరిశోధన. ఇక రోజుకు వెయ్యి అడుగులు నడిస్తే గుండె జబ్బులను 15 శాతం తగ్గించవచ్చట. 500 అడుగులు పెంచితే.. అవి ఏడు శాతం మేర తగ్గుతాయి. ఇక మరో విషయం ఏంటంటే..60 ఏళ్లు పైబడినవారు రోజుకు ఆరు వేల అడుగుల నుంచి 10 వేల అడుగులు నడిస్తే అకాల మరణాల ముప్ప 42 శాతం తగ్గుతుంది”అంటున్నారు పరిశోధకులు. రోజు ఎంత సేపు నడవాలి? ఎన్ని అడుగులు నడవాలి అనే విషయంపై స్పష్టత లేదు. ఎంత ఎక్కువ నడిస్తే అంత మంచి లాభాలుంటాయి. మెరుగైన ప్రయోజనాల కోసం 8వేల నుంచి 10వేల అడుగులు నడవడం అనేది ఉత్తమం అంటున్నారు నిపుణులు. వీలైనంత ఉత్తేజంగా ఉండాలట. వ్యాయామాన్ని ఆస్వాదించండం నేర్చుకోవాలి.



# అనుకున్నదే జరిగింది.. కరుణ్ నాయర్ గుడ్‌బై

అంతా ఊహించిందే జరిగింది. టీమిండియా వెటరన్ కరుణ్ నాయర్ విధర్బ జట్టుతో తెగదింపులు చేసుకున్నాడు. రాబోయే దేశవాళీ సీజన్‌లో తిరిగి కర్ణాటక తరపున ఆడేందుకు నాయర్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు క్రిక్‌బజ్ తమ కథనంలో పేర్కొంది. నాయర్ వ్యక్తిగత కారణాల వల్ల కర్ణాటకకు తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.
కాగా 2022లో కర్ణాటక జట్టులో చోటు కోల్పోయిన కరుణ్ నాయర్.. తన మకాంను విధర్బకు మార్చాడు. ఈ క్రమంలో రెండు సీజన్ల( 2023, 2024) పాటు విధర్బకు నాయర్ ప్రాతినిథ్యం వహించాడు. ఈ రెండు సీజనల్లోనూ కరుణ్ అద్భుతంగా రాణించాడు. ముఖ్యంగా రంజీ ట్రోఫీ 202425 సీజన్‌లో ఈ రైట్‌హ్యాండ్ బ్యాటర్ సంచలన ప్రదర్శన కనబరిచాడు. గత సీజన్‌లో రంజీ ఛాంపియన్‌గా విధర్బ నిలవడంలో కరుణ్‌ది కీలక పాత్ర. ఈ టోర్నీలో 16 ఇన్నింగ్స్‌లలో 53.93 సగటుతో 863 పరుగులు చేసి నాలుగో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం విజయ్ హజారే ట్రోఫీలో (779 పరుగులు) కూడా తన సూపర్ ఫామ్‌ను కొనసాగించి విదర్భను రన్నరప్‌గా నిలబెట్టాడు.
ఈ ప్రదర్శనల కారణంగా కరుణ్ నాయర్ ఎనిమిదేళ్ల తర్వాత భారత జట్టులోకి ఎంట్రీ ఇచ్చాడు. నాయర్ ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్నాడు. కానీ ఇంగ్లండ్ గడ్డపై మాత్రం నాయర్ తన మార్క్‌ను చూపించలేకపోతున్నాడు. 6 ఇన్నింగ్స్‌లో కలిపి కేవలం 131 పరుగులు మాత్రమే చేశాడు.
ఇక ఇది ఇలా ఉండగా.. కర్ణాటక సీనియర్ పేసర్ వాసుకి కౌశిక్ వచ్చే సీజన్‌లో గోవా తరపున ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమలో కౌశిక్ ఇప్పటికే కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (KSCA) నుండి నోఅబ్జెక్షన్ సర్టిఫికేట్ తీసుకున్నాడు. ఈ విషయాన్ని గోవా క్రికెట్ అసోసియేషన్ ధ్రువీకరించింది.

# అతడొక రన్‌మిషన్..

ఆండర్సన్‌టెండూల్కర్ ట్రోఫీలో టీమిండియా కొత్త టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ దుమ్మురేపుతున్న సంగతి తెలిసిందే. ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శతక్కొట్టిన గిల్.. ఆ తర్వాత ఎడ్జ్‌బాస్టన్‌లో భీబత్సం సృష్టించాడు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ(262)తో చెలరేగిన శుబ్‌మన్, రెండో ఇన్నింగ్స్‌లో సూపర్ సెంచరీతో మెరిశాడు.
కానీ లార్డ్స్ లో జరిగిన మూడో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల(16,6)లోనూ విఫలమయ్యాడు. ఈ క్రమంలో శుబ్‌మన్ గిల్‌పై భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్టులో గిల్ తిరిగి అత్యుత్తమ ప్రదర్శనను కనబరుస్తాడని మంజ్రేకర్ జోస్యం చెప్పాడు. కాగా సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే నాలుగో టెస్టులో భారత్ కచ్చితంగా గెలవాల్సిందే. ఈ కీలక మ్యాచ్‌లో గిల్ ఎలా రాణిస్తాడో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.
శుబ్‌మన్ గిల్ గిల్ తన ఫామ్‌ను కొనసాగిస్తాడని నేను భావిస్తున్నాను. అతడికి ఆ సత్తా ఉంది. లార్డ్స్ టెస్టుకు మాంచెస్టర్‌లో జరిగే నాలుగో టెస్టుకు దాదాపు ఎనిమిది రోజుల విశ్రాంతి లభించింది. దీంతో అతడు కాస్త రిలాక్స్‌గా ఉంటాడు. తన తండ్రి, స్నేహితులతో చాలా విషయాలు అతడు చర్చించి ఉంటాడు.



గిల్ తన కెప్టెన్సీ, వ్యూహాలు, ఫీల్డింగ్, బ్యాటింగ్‌పై పెట్టాలి. అప్పుడే మాంచెస్టర్‌లో గిల్ రన్‌మిషన్ తిరిగి మళ్లీ పనిచేస్తోంది. ప్రస్తుత భారత జట్టులో గిల్ పాత్ర చాలా ముఖ్యమైనది. లార్‌డ్స్‌లో జరిగిన మూడో టెస్టులో గిల్ బ్యాట్‌తో విఫలమయ్యాడు. దీంతో భారత్ ఓడిపోయింది. అయినప్పటికి మెన్ ఇన్ బ్లూ ఆఖరి వరకు పోరాడింది. దీని బట్టి భారత జట్టు కేవలం గిల్ ఒక్కడిపైనే ఆధారపడటం లేదని అర్ధమైంది అని జియో హాట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంజ్రేకర్ పేర్కొన్నాడు.

# ఆస్ట్రేలియా తుది జట్టు ప్రకటన.. డేంజరస్ ప్లేయర్ అరంగేట్రం

మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన ఆస్ట్రేలియా జట్టు.. ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లో సత్తాచాటేందుకు సిద్ధమైంది. ఆసీస్‌వెస్టిండీస్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆదివారం(జూలై 20) నుంచి ప్రారంభం కానుంది. ఈ క్రమంలో తొలి మ్యాచ్ కోసం తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఆస్ట్రేలియా మెనెజ్‌మెంట్ ప్రకటించింది.
ఈ మ్యాచ్‌తో యువ సంచలనం, విధ్వంసకర ఆల్‌రౌండర్ మిచెల్ ఓవెన్ ఆసీస్ తరపున అంతర్జాతీయ అరంగేట్రం చేయనున్నాడు. తొలి టీ20 కోసం ఎంపిక చేసిన తుది జట్టులో ఓవెన్‌కు చోటు దక్కింది. ఓవెన్ గత కొంత కాలంగా టీ20 క్రికెట్ లో దుమ్ము లేపుతున్నాడు.



బిగ్‌బాష్ లీగ్ 202425 సీజన్‌లో లో ఓవెన్ 452 పరుగులు చేసి లీడింగ్ రన్‌స్కోరర్‌గా నిలిచాడు. సిడ్నీ థండర్‌తో జరిగిన ఫైనల్లో మ్యాచ్‌లో ఓవెన్ విధ్వసకర సెంచరీతో చెలరేగాడు. ఆ తర్వాత ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరపున ఎంట్రీ ఇచ్చినప్పటికి పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు.
కానీ ఇటీవల జరిగిన మేజర్ లీగ్ టీ20 క్రికెట్‌లో మాత్రం ఆల్‌రౌండ్ ప్రదర్శనలతో ఓవెన్ ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలోనే జాతీయ జట్టు తరపున అరంగేట్రం చేయనున్నాడు. తొలి టీ20కు మాథ్యూ షార్ట్ గాయం కారణంగా దూరమయ్యాడు.
అతడి స్ధానంలో ఫ్రేజర్ మెక్‌గర్క్ తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. అదేవిధంగా ఐపీఎల్2025 సీజన్‌లో గాయపడ్డ ఆల్‌రౌండర్ టిమ్ డేవిడ్ కూడా తిరిగి ఆసీస్ ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చాడు. కాగా ఈ సిరీస్‌కు సీనియర్ ప్లేయర్లు ప్యాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హాజిల్‌వుడ్ దూరమయ్యారు.

## 2007 వరల్డ్ కప్ సీన్ రిపీట్.. బౌల్ అవుట్‌లో గెలిచిన సౌతాఫ్రికా


2007 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌పాకిస్తాన్ మధ్య జరిగిన బౌల్‌అవుట్ సగటు క్రికెట్ అభిమాని ఎప్పటికి మర్చిపోలేదు. టై అయిన మ్యాచ్‌లో బౌల్‌అవుట్ నియమం ద్వారా భారత్ విజయం సాధించింది. ఇప్పుడు అచ్చెం అటువంటి సీన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్2025లో రిపీటైంది.
ఈ టోర్నీలో భాగంగా శనివారం వెస్టిండీస్ ఛాంపియన్‌స్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌల్ అవుట్ ద్వారా దక్షిణాఫ్రికా ఛాంపియన్స్ విజయం సాధించింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది.
విండీస్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ క్రిస్ గేల్(2), పొలార్డ్(0) వంటి స్టార్ ప్లేయర్లు నిరాశపరచగా.. లెండల్ సిమ్మన్స్(28) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సఫారీ బౌలర్లలో ఫంగిసో రెండు, విల్జోయెన్, స్మట్స్, ఓలీవర్ తలా



వికెట్ సాధించారు. అనంతరం సౌతాఫ్రికా లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్దతి ప్రకారం 81 పరుగులగా నిర్ణయించారు. లక్ష్యాన్ని చేధించే క్రమంలో సౌతాఫ్రికా లెజెండ్స్ నిర్ణీత ఓవర్లలో 80 పరుగులే చేయగల్గింది. దీంతో మ్యాచ్ టై అయింది. ఈ క్రమంలో ఫలితాన్ని తేల్చేందుకు అంపైర్లు బౌల్ అవుట్ విధానాన్ని ఎంచుకున్నారు. సౌతాఫ్రికా ఆరు బంతుల్లో రెండు బౌల్‌డ్‌లు చేయగా.. విండీస్ ఒక్క బౌల్డ్ కూడా చేయలేకపోయింది. దీంతో సౌతాఫ్రికా విజేతగా నిలిచింది. కాగా ఛాన్నాళ్ల తర్వాత ప్రొఫిషనల్ క్రికెట్ ఆడిన సఫారీ దిగ్గజం ఏబీ డివిలియర్స్ కేవలం 3 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు.

# బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత్ జోరు..

ఇండోనేషియాలో జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ మిక్‌స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఎదురులేకుండాపోయింది. టోర్నీలో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన చివరి గ్రూపు మ్యాచ్‌లో భారత్ 110100 తేడాతో హాంకాంగ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌కు ముందు హాంకాంగ్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచింది. జోరు మీద ఉన్న ఆ జట్టు కూడా భారత్‌కు తీవ్ర పోటీనిచ్చింది. కానీ, భారత యువ షట్లర్లు తమ ఆధిపత్యం ప్రదర్శిస్తూ ప్రత్యర్థి ప్లేయర్లను నిలువరించారు. ఐదు మ్యాచ్‌లు ముగిసే సమయానికి భారత్ 5549తో ఆధిక్యంలో నిలిచిన భారత్ ఆ తర్వాత ప్రత్యర్థి నుంచి



ప్రతిఘటన ఎదురైనప్పటికీ లీడ్‌ను కాపాడుకుని విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌కు ముందు శ్రీలంక, యూఏఈలపై నెగ్గడంతో భారత్ క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న విషయం తెలిసిందే. తాజా విజయంతో గ్రూపు డిలో టాప్ పొజిషన్‌లో నిలిచింది. సోమవారం క్వార్టర్ ఫైనల్‌లో జపాన్‌ను ఎదుర్కోనుంది.



# చరిత్ర సృష్టించిన హంపి..

జార్జియాలో జరుగుతున్న ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి సెమీస్‌కు చేరుకుంది. వరల్డ్ కప్‌లో సెమీస్‌లో అడుగుపెట్టిన తొలి ఇండియన్‌గా ఘనత సాధించింది. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో ఆమె 1.50.5 తేడాతో చైనాకు చెందిన యుక్సిన్ సాంగ్‌పై విజయం సాధించింది. రెండు క్లాసికల్ గేముల్లో శనివారమే హంపి తొలి గేము నెగ్గి విజయానికి చేరువైంది. ఆదివారం జరిగిన రెండో గేమును యుక్సిన్ సాంగ్‌తో కలిసి డ్రా చేసుకుంది. నల్ల పావులతో ఆడిన ఆమె 53 ఎత్తుల్లో పాయింట్స్ పంచుకుంది. సెమీస్‌లో హంపి చైనాకు చెందిన లీ టింగ్జీతో తలపడనుంది. మరోవైపు, మరో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలి టోర్నీ నుంచి నిష్క్రమించింది. క్వార్టర్‌స్‌లో రెండో గేమును చైనాకు చెందిన టాంగ్ జోంగి చేతిలో కోల్పోవడంతో మ్యాచ్‌ను 1.50.5తో ఓడిపోయింది. ఇక, దివ్య దేశ్‌ముఖ్, ద్రోణవల్లి హారిక మధ్య జరుగుతున్న క్వార్టర్స్ టై బ్రేకర్‌కు వెళ్లింది. తొలి గేమును డ్రా చేసుకున్న వీరు రెండో గేములోనూ పాయింట్స్ పంచుకున్నారు. నేడు టై బ్రేకర్ జరగనుంది.

# డబ్ల్యూటీసీ ఫైనల్‌స్‌పై కీలక నిర్ణయం

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ ఆతిథ్యంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మూడుసార్లు టెస్టు గద సమరాన్ని నిర్వహించిన ఇంగ్లండ్ బోర్డుకే పట్టం కట్టింది ఐసీసీ. వచ్చే సీజన్ ఒక్కటే కాదు మరో రెండు ఫైనల్స్ బాధ్యతను కూడా ఈసీబీకే రాసిచ్చింది. 2027, 2029, 2031 టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌కు ఈసీబీనే ఆతిథ్యం ఇవ్వనుంది.
గత మూడు సీజన్ల డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఇంగ్లండ్‌లోనే జరిగాయి. దాంతో.. ఈసీబీకి అధిక ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదని.. వచ్చే సీజన్లకు వేదికను మారిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. కానీ, ఈసీబీ అత్యంత పకడ్బందీగా ఈ మ్యాచ్‌లను నిర్వహించింది. అంతేకాదు అక్కడి ప్రేక్షకులు ఐదు రోజుల ఆటను చూసేందుకు భారీగా తరలివచ్చారు కూడా. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న ఐసీసీ.. డబ్ల్యూటీసీ టైటిల్ పోరును సమర్ధంగా నిర్వహించిందినందున.. వేదికను మార్చడం సరైంది కాదని భావించింది. దాంతో.. 2027 ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశ పడిన బీసీసీఐకి భంగపాటు ఎదురైంది. ఐసీసీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఇంగ్లండ్ బోర్డు సంతోషం వ్యక్తం చేసింది.




న్యూజిలాండ్ మొదటి ఛాంపియన్
టీ20లు.. ఫ్రాంచైజీ క్రికెట్‌ల విస్తరణతో కళ తప్పుతున్న సుదీర్ఘ ఫార్మాట్‌కు ఊపిరిలూదేందుకు ఐసీసీ 201921లో టెస్టు ఛాంపియన్‌షిప్‌ను తెరపైకి తీసుకొచ్చింది. తొలి ఎడిషన్‌ను ఇంగ్లండ్‌లోని సౌతాంప్టన్ మైదానంలో నిర్వహించారు. భారత్‌ను ఓడించిన న్యూజిలాండ్ మొట్టమొదటి ఛాంపియన్‌గా అవతరించింది. రెండో సీజన్ ఫైనల్ కూడా ఇంగ్లండ్‌లోనే. ఈసారి కూడా ఫలితం మారలేదు. ఓవల్ స్టేడియంలో టీమిండియాను 209 పరుగుల తేడాతో చిత్తు చేసి ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది.
ఈమధ్యే లార్డ్స్ వేదికగా జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో ఎడెన్ మర్‌క్రమ్ సూపర్ సెంచరీకి తోడు.. రబడ విజృంభణతో దక్షిణాఫ్రికా సంచలనం సృష్టించింది. అంతే.. రెండోసారి టెస్టు గదను తన్నుకుపోవాలనుకున్న కమిన్స్ సేనకు చెక్ పెట్టింది. తొలిసారి జగజ్జేతగా నిలిచిన ప్రొటీస్ జట్టు ఐసీసీ ట్రోఫీ గెలవాలనే తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎక్కడికి వెళ్లినా అనుష్క వెంట ఇది కచ్చితంగా ఉండాల్సిందే!



అనుష్క శెట్టి నవంబర్ 7న పుట్టింది. అదే రోజున మహానటుడు కమల్ హాసన్ పుట్టిన రోజు. అందుకే కొందరు 'నటనకి పుట్టిన రోజు' అని కామెంట్ చేస్తుంటారు. నటన మీద ఆసక్తి లేకపోయినా, అనుకోకుండా హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. ముంబైలో భరత్ ఠాకూర్ వద్ద యోగా టీచర్‌గా పనిచేస్తుండగా, బాలీవుడ్ డైరెక్టర్ ఇ.నివాస్ ద్వారా తెలుగు దర్శక నిర్మాత పూరీ జగన్నాథ్ పరిచయమయ్యారు.

**అరుంధతితో స్టార్‌డమ్**

రామ్ చరణ్ మొదటి సినిమా 'చిరుత'.. మొదట పూరీ జగన్నాథ్ తమ్ముడు సాయిరామ్ శంకర్‌తో 'సాగర్' పేరుతో మెహర్ రమేష్ డైరెక్షన్‌లో తీద్దామనుకున్నారు. ఆ సినిమా కోసం అనుష్కను మొదట ఫొటోషూట్ చేశారు. కానీ అనుకున్నవేవీ జరగలేదు. 'సూపర్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైంది. 'అరుంధతి'తో వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. 'బాహుబలి', 'రుద్రమదేవి', 'భాగమతి' మొదలైన సినిమాలు ఆమె స్టార్‌డమ్‌ను పెంచాయి.

**అర్జున్‌రెడ్డిలో..**

కర్ణాటకలోని మంగళూరు ప్రాంతానికి చెందిన కుటుంబం అనుష్క శెట్టిది. అందుకే విజయ్ దేవరకొండ 'అర్జున్ రెడ్డి'లో హీరోయిన్ మంగళూరు ఏరియాకు చెందిన అమ్మాయి అని చూపించగానే, అనుష్క బాగా కనెక్ట్ అయి, ఆ విషయం హైలైట్ చేస్తూ ట్వీట్ కూడా చేసింది. క్రిష్ డైరెక్షన్‌లో గతంలో 'వేదం' సినిమా చేసిన అనుష్క శెట్టి ఇప్పుడు 'ఘాటీ' మూవీ చేస్తోంది.

**హారర్ సినిమాలంటే భయం**

మలయాళంలో ఫస్ట్ టైమ్ యాక్ట్ చేస్తోంది. ఆ సినిమా పేరు 'ఘటన'. కార్తీ నటించిన 'ఖైదీ' సినిమా ఎంతటి సెన్సేషనల్ హిట్టో అందరికీ తెలిసిందే. ఆ సినిమా సీక్వెల్‌కి అనుష్కని హీరోయిన్‌గా డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ సెలెక్ట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదెంత నిజమో చూడాలి. 'అరుంధతి', 'పంచాక్షరి', 'భాగమతి', 'నిశ్శబ్దం' లాంటి హారర్, క్రైమ్ థ్రిల్లర్స్‌లో యాక్ట్ చేసిన అనుష్కకి పర్సనల్‌గా హారర్ సినిమాలు చూడటం అంటే మాత్రం చాలా భయం!

**వెంటే ఉండాలి**

అనుష్క షిర్డీ సాయిబాబా భక్తురాలు. తన మేకప్ రూమ్‌లో, కార్వాన్‌లో.. తను వెళ్ళిన ప్రతి చోటకి సాయిబాబా విగ్రహం చిన్నదైనా తీసుకుని వెళ్తుంది. కొంతకాలం వరకు అనుష్కకి, సూపర్ స్టార్ రజనీకాంత్‌కి ఒకే మేకప్ వుమన్ పని చేసేవారు.


# తొలిరోజు కంటే రెండో రోజు కాస్త ఎక్కువ వసూళ్లు

రీసెంట్‌గా థియేటర్లలో పలు చిత్రాలు రిలీజ్ కాగా.. 'జూనియర్' చిత్రానికి చెప్పుకోదగ్గ వసూళ్లు కనిపిస్తున్నాయి. కిరీటికి హీరోగా ఇదే తొలి సినిమా అయినప్పటికీ డ్యాన్సులు, ఫైట్స్, డైలాగ్స్ లాంటివి బాగా చెప్పడం.. దానికి తోడు 'వైరల్ వయ్యారి' పాట తెగ వైరల్ అయిపోయేసరికి జనాలు ఈ మూవీని చూసేందుకు ఓ మాదిరిగా థియేటర్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే తొలిరోజు కంటే రెండో రోజు వసూళ్లు కాస్త ఎక్కువగానే వచ్చాయి. ఇంతకీ రెండు రోజుల్లో వచ్చిన కలెక్షన్ ఎంత?

కిరీటి, శ్రీలీల, జెనీలియా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని రెగ్యులర్ కమర్షియల్ తరహా కథతోనే తెరకెక్కించారు. అంతెందుకు గతంలో వచ్చిన తెలుగు చిత్రాల ఛాయలు కూడా చాలా కనిపిస్తాయి. అయితేనేం వేరే చిత్రాలేం లేకపోవడం దీనికి ఓ రకంగా కలిసొచ్చిందని చెప్పొచ్చు. ఈ క్రమంలోనే తొలిరోజు రూ.1.45 కోట్లు వసూళ్లు రాగా.. రెండో రోజు రూ.1.65 కోట్ల మేర కలెక్షన్ వచ్చినట్లు ట్రేడ్ పండితులు చెబుతున్నారు. అంటే రెండు రోజులకు కలిపి రూ.3.10 కోట్ల మేర నెట్ కలెక్షన్ అందుకున్నట్లు తెలుస్తోంది.

హీరోగా కొత్త కుర్రాడు చేస్తున్నప్పటికీ ఈ మాదిరి వసూళ్లు అంటే కాస్త విశేషమనే చెప్పాలి. అయితే వచ్చేవారం థియేటర్లలోకి 'హరిహర వీరమల్లు' రానుంది. ఇంతలోనే 'జూనియర్' కలెక్షన్స్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. మరి ఈ మూవీకి లాంగ్ రన్ అయ్యేసరికి ఎంత వసూళ్లు వస్తాయో చూడాలి?

జూనియర్ విషయానికొస్తే.. జ్ఞాపకాలే ముఖ్యమనుకునే కుర్రాడు అభి (కిరీటి). కాలేజీలో సరదాగా గడుపుతూనే చదువులో మంచి ప్రతిభ చూపిస్తాడు. తను ప్రేమించిన శ్రీలీల పనిచేసే కంపెనీలోనే ఉద్యోగం సంపాదిస్తాడు. కానీ ఆ కంపెనీ బాస్ విజయ (జెనీలియా)కు అభి అస్సలు నచ్చడు. ఆమెకు తన పేరుతో ఉన్న విజయనగరం అనే ఊరు కూడా నచ్చదు. అలాంటిది అభితో కలిసి విజయ.. విజయనగరం వెళ్లాల్సి వస్తుంది. అక్కడికి వెళ్లాక ఏం జరిగింది? ఆ ఊరికి విజయకు సంబంధమేంటి అనేది మిగతా స్టోరీ.






# కనీసం వాటర్ బాటిల్ పట్టుకెళ్లనివ్వండి

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఎంతో బాగుందనే టాక్ వస్తే తప్పితే కొత్త సినిమా చూసేందుకు జనాలు థియేటర్లకు వెళ్లట్లేదు. అయితే ఇలా జరగడానికి మరో కారణం కూడా ఉంది. ఇప్పుడు టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్‌కి అలాంటి అనుభవమే ఎదురైంది. ఈ మేరకు ట్వీట్ చేయడంతో సదరు విషయం కాస్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

మిగతా చోట్ల ఏమో గానీ తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు చాలా థియేటర్లలో పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ రేట్లు కళ్లు చెదిరేలా ఉంటాయి. తాజాగా ఓ సినిమా చూసేందుకు థియేటర్‌కి వెళ్లిన నిఖిల్ కూడా తినుబండరాల ధరలు చూసి షాకయ్యాడు. తను కొన్న టికెట్ రేటు కంటే వీటికే ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వచ్చిందని ట్విటర్‌లో చెప్పుకొచ్చాడు. కనీసం వాటర్ బాటిల్ పట్టుకుని వెళ్లేందుకైనా అనుమతించాలని రిక్వెస్ట్ చేశాడు. ఈ విషయంలో డిస్ట్రిబ్యూషన్ సర్కిల్ కాస్త దృష్టి పెడితే బాగుంటుందని, అప్పుడే జనాలు థియేటర్లకు వస్తారని అన్నాడు.

కొన్నిరోజుల ముందు నిర్మాత నాగవంశీ కూడా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇదే విషయమై తన అనుభవాన్ని బయటపెట్టారు. తలో రెండు పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ ఏకంగా రూ.1000కి పైనే అయ్యాయని అన్నారు. దీంతో ఇప్పుడీ విషయం మరోసారి చర్చనీయాంశమైంది. ప్రస్తుతం టాలీవుడ్ నిర్మాతలు.. జనాలు థియేటర్లకు రావట్లేదని తెగ బాధపడిపోతున్నారు. అయితే కంటెంట్ విషయంలో దృష్టి పెట్టడంతో పాటు వీటి రేట్లు కూడా అందుబాటులో ఉంటేనే జనాలు కాస్తో కూస్తో రావడానికి ఆసక్తి చూపిస్తారు. లేదంటే మాత్రం పూర్తిగా ఓటీటీలకు అలవాటు పడిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు.



# రెడ్ చీరలో నిధి అగర్వాల్ గ్లామర్ షో

వ్యసాచి సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ గురించి స్పెషల్‌గా చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం ఈ బ్యూటీ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన 'రాజా సాబ్' సినిమాలో నటిస్తోంది. ఇక ఈ చిత్రం మారుతి డైరెక్షన్‌లో తెరకెక్కుతోంది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన 'హరిహర వీరమల్లు' సినిమాలో కూడా నటిస్తోంది. క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ చిత్రాల నిర్మాత ఏ ఎమ్ రత్నం నిర్మిస్తున్నారు. ఇక ఈ మూవీ ఈ నెల 24న థియేటర్లలో రిలీజ్ కానుంది. అలా ఓ పక్కా సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నప్పటికీ నిత్యం సోషల్ మీడియా లోనూ చాలా యాక్టివ్‌గా ఉంటుంది నిధి. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది.ఈ క్రమంలో ఈ ముద్దుగుమ్మ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా నిధి తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. అందులో రెడ్ కలర్ చీరలో అదిరిపోయింది. నడుము కనిపించేలా ఫొటోస్‌కి స్టిల్స్ ఇచ్చి కుర్రకారును మెస్మరైజ్ చేసింది. అలాగే తన అందంతో అందరినీ కట్టిపడేసింది. దీంతో ఈ పిక్స్ కాస్త నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు ఆకాశం నుంచి ఊడి పడ్డ చందమామలా ఉన్నావు అని, పాపలకే పాప మా నిధి పాప అని, బ్యూటిఫుల్ అని, గార్జియస్ అని కామెంట్స్ చేస్తున్నారు. మరి మీరు కూడా ఈ ముద్దుగుమ్మ పోస్ట్ పై ఓ లుక్ వేయండి.



# బుర్రకథ శిఖామణి జీవితంపై సినిమా

నిజజీవిత కథలు, సంఘటనలు స్ఫూర్తిగా తీసుకుని తెలుగులో ఎప్పటికప్పుడు సినిమాలు తీస్తూనే ఉంటారు. ఇప్పుడు అలా రాబోతున్న మరో మూవీ 'గరివిడి లక్ష్మి'. చాన్నాళ్ల క్రితమే ఈ చిత్రం నుంచి 'నల్లజీలకర్ర మొగ్గ' అని సాగే ఓ పాటని రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు గ్లింప్స్ విడుదల చేశారు. ప్రధాన పాత్రధారిని పరిచయం చేశారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో బుర్రకథ అంటే తెలియని వారుండరు. పండగలు, ఉత్సవాల టైంలో బుర్రకథల్ని ఎక్కువగా వేస్తుంటారు. 90ల కాలంలో దాదాపు 15 ఏళ్లలో ఏకంగా 10 వేలకు పైగా ప్రోగ్రామ్స్ చేసి గుర్తింపు తెచ్చుకున్న గరివిడి లక్ష్మీ అనే ఆమె జీవితం ఆధారంగా ఈ సినిమా తీసినట్లు చిత్రబృందం ఇప్పుడు క్లారిటీ ఇచ్చింది. గ్లింప్స్ కూడా సింపుల్‌గానే ఉంది. లక్ష్మీ పాత్రలో ఆనంది నటించబోతుంది. ఇదివరకే ఈమె.. జాంబీరెడ్డి, భైరవం తదితర సినిమాల్లో నటించింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in